RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 81 | శుక్రవారం, ఏప్రిల్ 26, 2024 | పేజీలు : 4

## కాంగ్రెస్‌లో చేరిన వరంగల్ మేయర్ గుండు సుధారాణి

హైదరాబాద్: బిఆర్ఎస్ పార్టీకి సొంత పార్టీ నేతలు వరుసగా షాకులిస్తున్నారు. ఇప్పటికే సిట్టింగ్ ఎంపిలు, ఎమ్మెల్యేలు సైతం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి వరంగల్ జిల్లాలో బిఆర్ఎస్ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. వరంగల్ మేయర్ గుండు సుధారాణి గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు ఆమెకు పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు. ఈ క్రమంలోనే ఆ పార్టీలోని కీలక నేత, మేయర్ గుండు సుధారాణి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పరిణామాలు పూర్తిగా మారిపోయాయి.

### ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీల హక్కులను కాలరాసేందుకు...

## కాంగ్రెస్ కుట్ర



న్యూఢిల్లీ: దేశంలోని ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీల హక్కులను కాలేరాసే కుట్రకు కాంగ్రెస్ పార్టీ తెరలేపిందని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ఆరోపించారు. యూపీలోని ఆగ్రాలో జరిగిన ర్యాలీని ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడుతూ కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓబీసీల హక్కులను లాగేసుకుందని, ఆపై దేశవ్యాప్తంగా ఎక్కడ అధికారంలోకి వచ్చినా ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీలను వంచించేందుకు అలాగే చేయాలని భావిస్తోందని ఆరోపించారు. కర్నాటకలో ముస్లింలందరినీ ఓబీసీ జాబితాలో చేర్చుతూ అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం రాత్రికి రాత్రి నిర్ణయం తీసుకుందని వివరంచారు. కాంగ్రెస్ ఓబీసీల హక్కులను కాలరాసిందని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. యూపీలోనూ ఈ క్రీడను రక్తికట్టించేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతోందని దుయ్యబట్టారు. దేశంలో ఎక్కడ అవకాశం వచ్చినా కాంగ్రెస్ ఈ పనికి తెగబడుతుందని అన్నారు. దొడ్డిదారిన ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు కోతలు పెట్టి దాన్ని ఇతరులకు బీజేపీ అందిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ఈ క్రమంలో సమాజ్‌వాదీ పార్టీ పూర్తిగా వత్తాసు పలుకుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. '

### మోదీ మళ్ళీ అధికారంలోకి వస్తే...

## రిజర్వేషన్‌లు రద్దు



హైదరాబాద్: రైతుల ఆదాయం పెంచుతానన్న మోడీ.. వారికి ఖర్చులు పెంచారని%౯% పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు వస్తే రిజర్వేషన్లు రద్దు చేయాలని బీజేపీ చూస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ఎన్నడైనా ఫామ్‌హౌజ్ నుంచి బయటకు వచ్చి రైతులతో మాట్లాడారా? పంటలను పరిశీలించారా అని ప్రశ్నించారు. చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డికి మద్దతుగా గురువారం రాత్రి రాజేంద్రనగర్‌లో నిర్వహించిన రోడ్ షోలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై విమర్శలు గుప్పించారు. దేశంలో 70 ఏళ్లుగా అమలులో ఉన్న రిజర్వేషన్లు రద్దు చేయాలని బీజేపీ తలపెట్టిందని, ఇదే వారి ఆఖరి అస్త్రమని తెలంగాణ ఆరోపించారు. కేసీఆర్, మోడీ పదేళ్లు అధికారంలో ఉన్నారని, అయినా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని సీఎం రేవంత్? రెడ్డి విమర్శించారు. డిసెంబర్ 3న ప్రజలు కారును షెడ్డుకు పంపించారని, షెడ్డుకు పోయిన కారు తుప్పుపట్టి పోయిందని రేవంత్ ఎద్దేవా చేశారు. కేసీఆర్ పదేళ్లలో ఎప్పుడైనా ఫామ్‌హౌజ్ నుంచి బయటకు వచ్చారా? రైతులతో మాట్లాడారా? పంటలను పరిశీలించారా? అని సీఎం రేవంత్ నిలదీశారు. నాలుగు గంటలు టీవీలో మాట్లాడిన బీఆర్ఎస్ అధినేత అసెంబ్లీకి వచ్చి ఎందుకు సమాధానాలు చెప్పలేదని ప్రశ్నించారు. రైతుల ఆదాయం పెంచుతానన్న మోడీ.. వారికి ఖర్చులు పెంచారని ఆరోపించారు. నల్ల చట్టాలు తెచ్చి వేల మంది రైతుల ప్రాణాలు బలి తీసుకున్నారని మండిపడ్డారు. పార్లమెంటులో మూడొంతుల మెజార్టీ వస్తే, రిజర్వేషన్లు రద్దు చేయటమే ఆ పార్టీ అజెండా అని వ్యాఖ్యానించారు. ఆర్ఎస్ఎస్ విధానాలు, అజెండానే మోడీ సర్కారు అమలు చేస్తోందని విమర్శించారు. తెలంగాణకు ఇచ్చిన హామీలను కేంద్రం నెరవేర్చలేదని మండిపడ్డారు.

### పదేళ్ల మోడీ పాలనలో...

## వందేళ్ల విధ్వంసం




### సిఎం రేవంత్ ట్వీట్

హైదరాబాద్: పదేళ్ల మోడీ పాలనలో వందేళ్ల విధ్వంసమంటూ సిఎం రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. గురువారం ఉదయం గాంధీ భవన్ వేదికగా 'నయవంచన – పదేండ్ల మోసం... వందేండ్ల విధ్వంసం' పేరుతో బీజేపీపై కాంగ్రెస్ పార్టీ ప్రజా చార్జిషీట్‌ను ఆవిష్కరించింది. ఈ కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డితో పాటు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఇందుకు సంబంధించిన చిత్రాలను రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం ఎక్స్ వేదికగా పంచుకుంటూ బిజెపిని విమర్శిస్తూ ట్వీట్ చేశారు. 'మోదీ పాలనలో వికసిత భారత్ కాదు, విభజిత భారత్, మోదీ పాలనలో ఆర్థిక భారత్ కాదు, ఆకలి భారత్, మోదీ పాలనలో కొలువుల భారత్ కాదు, నిరుద్యోగ విలపిత భారత్, పదేళ్ల మోదీ పాలనలో వందేళ్ల విధ్వంసం' అంటూ ట్వీట్ చేశారు.

### తెలంగాణలో 17 లోక్ సభ స్థానాలకు...

## 547 నామినేషన్లు




హైదరాబాద్: తెలంగాణలో ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం ముగిసింది. 17 లోక్ సభ స్థానాలకు గాను 547 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 18న ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ ఈరోజు ముగిసింది. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు డమ్మీ అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు కూడా చాలామంది నామినేషన్లు దాఖలు చేశారు. రేపు నామినేషన్ల పరిశీలన ప్రక్రియ.. 29 వ తేదీ వరకు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. మే 13న పోలింగ్, జూన్ 4న ఎన్నికల ఫలితాలు రానున్నాయి. ఖమ్మం లోక్ సభ స్థానానికి 29 నామినేషన్లు దాఖలయ్యాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని రెండు లోక్ సభ స్థానాలకు 120కి పైగా నామినేషన్లు వచ్చాయి. ఈరోజు చివరి రోజు... దీనికి తోడు మంచి రోజు కావడంతో ఎక్కువ నామినేషన్లు దాఖలయ్యాయి. కొంతమంది అభ్యర్థులు రెండు లేదా మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరగనుంది. ఇక్కడి నుంచి 13 నామినేషన్లు దాఖలయ్యాయి.

### కులగణన అంటే...

## మోడీకి భయం



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోపై ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న ఆరోపణలకు కాంగ్రెస్ అగ్రనేత రాహు ల్ గాంధీ బుధవారం ఘాటుగా జ వాబిచ్చారు. ఇది రాజకీయ సమస్య కాదని, దేశ జనాభాలో 90 శాతం ఉన్న బడుగు వర్గాలకు న్యాయం చేయడమే తన జీవితాశయమని రాహుల్ ప్రకటించారు. దేశ భక్తులమని తమను తాము చెప్పుకుంటున్న వారు కుల గణన ద్వారా దేశానికి ఎక్స్‌రే తీస్తామంటే భయపడిపోతున్నారని రాహుల్ విమర్శించారు. బుధవారం నాడిక్కడ సమృద్ధ భారత్ ఫౌండేషన్ నిర్వహించిన సామాజిక్ న్యాయ్ సమ్మేళన్‌లో రాహుల్ ప్రసంగిస్తూ కాంగ్రెస్ మేనిఫెస్టో విప్లవాత్మకమైన మేనిఫెస్టోగా ఆయన అభివర్ణించారు. తమ మేనిఫెస్టో చూసి ప్రధాని మోడీ భయకంపితులయ్యారని ఆయన వ్యాఖ్యానించారు. గత పదేళ్లుగా తాను ఓబిసినంటూ ప్రతిఒక్కరికి చెప్పుకుంటున్న మోడీ తాను కుల గణన గురించి మాట్లాడడం ప్రారంభించగానే అసలు కులమే లేదంటూ మాట్లాడుతున్నారని రాహుల్ ఎద్దేవా చేశారు. ఆ తర్వాత పేద, ధనిక అనే రెండే కులాలు ఉన్నాయంటూ మోడీ చెప్పడం ప్రారంభించారని, ఆయన మాటలే నిజమైతే పేదలను లెక్కిద్దామని, 90 శాతం పేదలు దళితులు, ఆదివాసీలు, ఓబిసిలే ఉంటారని రాహుల్ చెప్పారు. సంపన్నులలో ఈ కులాల వారు మీకు కనపడరని ఆయన అన్నారు. తనకు ఇది రాజకీయ సమస్య కాదని, ఇది తనకు జీవితాశయమని రాహుల్ చెప్పారు కేంద్రంలో కాంగ్రెస్ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తమ ప్రథమ ఎజెండా కులగణనేనని ఆయన ప్రకటించారు. దేశంలోని మీడియా, న్యాయ వ్యవస్థ, ప్రైవేట్ ఆసుపత్రులు, బడా కంపెనీలు వంటి రంగాలలో దళితులు, ఆదివాసీలు, ఓబిసిల ఉనికి చాలా తక్కుగా ఉందని ఆయన తెలిపారు. 90 శాతం జనాభా శక్తిని మనం వినియోగించుకోవాలి. తమను తాము దేశభక్తులమని చెప్పుకుంటున్న వారు ఎక్స్‌రే అంటే భయపడిపోతున్నారు అంటూ రాహుల్ వ్యాఖ్యానించారు.

### పులివెందుల నుంచి...

## వైఎస్. జగన్ నామినేషన్



విజయవాడ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ సిపి అధ్యక్షుడు వైఎస్. జగన్ గురువారం పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తన నామినేషన్ ఫైల్ చేశారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ పులివెందుల తన హార్ట్ బీట్ అన్నారు. పులివెందుల ఓటర్ల మద్దతుతోనే తన పయనం కొనసాగుతోందన్నారు. సిఎస్ఐ గ్రౌండ్ లో జగన్ ప్రసంగిస్తున్నప్పుడు 'జై జగన్' అంటూ అభిమానులు నినాదాలు చేశారు. జగన్ తన ప్రసంగంలో కడప కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వైఎస్. షర్మిల, వైఎస్. సునీత లను విమర్శించారు. తన పినాన్న వివేకానంద రెడ్డి మరణానికి కారకులెవరో ప్రజలకు బాగా తెలుసునని జగన్ తెలిపారు. తన తండ్రి వైఎస్. రాజశేఖర్ రెడ్డి దుర్మరణానికి కుట్ర పన్నిన వారితోనే తన సోదరీమణులు చేతులు కలపడంపై ఆయన సంతాపం వ్యక్తం చేశారు. అలాగే అవినాశ్ రెడ్డికి కళంకం అంటగట్టడానికి ప్రయత్నించడాన్ని కూడా ఆయన దుయ్యబట్టారు.

## మళ్లీ మోడీ గెలిస్తే దేశం సర్వనాశనం: దీపాదాస్ మున్షీ



హైదరాబాద్: మళ్లీ ప్రధాని నరేంద్ర మోడీ గెలిస్తే దేశం సర్వనాశనం అవుతోందని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ ఛార్జ్ దీపాదాస్ మున్షీ తెలిపారు. హామీలన్నీ మోడీ ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యం ఉండాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. పదేండ్ల మోసం, వందేళ్ల విధ్వంసం పేరుతో బిజెపి పాలనపై కాంగ్రెస్ ప్రజా ఛార్జీషీట్ విడుదల చేసింది ఈ సందర్భంగా దీపాదాస్ మున్షీ మాట్లాడారు. బిజెపి పాలనలో ధరలు, నిరుద్యోగం పెరిగిందని మండిపడ్డారు. కాంగ్రెస్ జోడో యాత్ర చేస్తుంటే బిజెపి విద్వేసం పెంచుతోందని, పదేళ్లుగా ప్రజాస్వామ్యంపై బిజెపి దాడులు చేస్తోందని ఆమె దుయ్యబట్టారు.

### మోదీ, రాహుల్ ప్రసంగాలపై...

## ఈసీ అసహనం

### - రెండు పార్టీలకూ నోటీసులు



న్యూఢిల్లీ: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఎన్నికల సంఘం తాజాగా నోటీసులు ఇచ్చింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి విద్వేషపూరిత ప్రసంగాలతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ఫిర్యాదులు రావడంతో రెండు పార్టీలకు ఎన్నికల సంఘం తాజాగా నోటీసులు పంపింది. ఏప్రిల్ 29వ తేదీ ఉదయం 11 గంటల్లోగా దీనిపై వివరణ ఇవ్వాలంటూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేని ఈసీ ఆదేశించింది. ఈ సందర్భంగా మోదీ, రాహుల్ ప్రసంగాలపై ఈసీ అసహనం వ్యక్తం చేసింది.

రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులు ఎన్నికల నియమావళిని అనుసరిస్తున్నాయా లేదా అన్నది ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని, అది పార్టీ బాధ్యత అని తెలిపింది. ముఖ్యంగా స్టార్ క్యాంపెయినర్ల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఉన్నత స్థాయిల్లో ఉన్న వ్యక్తుల ప్రచార ప్రసంగాలు మరింత తీవ్రమైన పరిణామాలకు దారి తీసే ప్రమాదం ఉంటుందని ఈసీ తన నోటీసుల్లో పేర్కొంది.

## సంపాదకీయం

### మారుతున్న తల్లిదండ్రుల ఆలోచనలు

దేశంలో ప్రభుత్వ రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మక సర్వీసులుగా పేరుగాంచిన సివిల్స్‌లో తెలుగు విద్యార్థుల హవా పెరుగుతున్నది. ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్‌లను ఎంపిక చేసే సివిల్స్ పరీక్షల్లో ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థులే సింహ భాగం ఎంపికవుతున్న పరిస్థితిని తెలుగు రాష్ట్రాలు ప్రత్యేకించి దక్షిణాది రాష్ట్రాలు క్రమక్రమంగా మారుస్తున్నట్లు ఫలితాలు తేటతెల్లం చేస్తున్నాయి. ప్రతి సంవత్సరం సివిల్స్‌కు దక్షిణాది నుంచి ఎంపికయ్యే వారి శాతం పెరగడం గర్వకారణంగా చెప్పుకోవచ్చు. బుధవారం వెలువడిన సివిల్స్ పరీక్షల్లో తెలుగు రాష్ట్రాల నుంచి 60 మంది ఎంపిక కావడం మామూలు విషయం కాదు. దక్షిణాదితో పోలిస్తే ఈ సంఖ్య తక్కువే అయినా ప్రతి ఏడాది సివిల్స్ ఛేదిస్తున్న విద్యార్థుల శాతం పెరగడం ఆశావహ పరిణామంగా చెప్పవచ్చు. తాజా సివిల్స్ విజేతల్లో వంద లోపు ర్యాంకుల్లో నలుగురు తెలుగువారు ఉండడం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 60 మంది దాకా ర్యాంకులు సాధించడంతో సివిల్స్ పట్ల దక్షిణాది ప్రాంతాల మొగ్గ పెరుగుతోందని చెప్పడానికి సూచికగా భావించవచ్చు. ఇప్పటిదాకా ఉత్తరాది రాష్ట్రాలదే సివిల్స్‌లో అగ్రస్థానం. ఇప్పటికీ అగ్రస్థానమే అయినప్పటికీ తెలుగు రాష్ట్రాల నుంచి, కర్నాటక నుంచి సివిల్స్ విజేతలు రోజురోజుకూ పెరగడం తల్లిదండ్రులు, విద్యార్థుల ఆలోచనల్లో వచ్చిన మార్పుగా చెప్పవచ్చు. ప్రతి ఏటా యుపిఎస్‌సి ద్వారా సివిల్స్‌లో పరీక్షలు దేశవ్యాప్తంగా జరుగుతాయి. ఈ దఫా వెయ్యి దాకా ఉన్న పోస్టులకు ప్రిలిమ్స్ పరీక్షకు ఏడు లక్షల మంది వరకూ రాశారు. మూడు దశల వడపోతల ద్వారా ఈ పరీక్షను నిర్వహిస్తారు. ముందుగా ప్రిలిమ్స్ ఆ తర్వాత మెయిన్, చివరగా ఇంటర్వ్యూ నిర్వహించి మూడింటి మెరిట్ ఆధారంగా విజేతలను ప్రకటిస్తారు. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ పరీక్షల్లో ఎంపికైన వారు ప్రజాసేవల రంగంలో కలెక్టర్లుగా, ఎస్‌పిలుగా, విదేశీ సేవల్లో ఉన్నతాధికారులుగా ప్రజాక్షేత్రంలో పని చేస్తారు. అయితే ఈ పరీక్షల్లో విజేతలు ఎక్కువగా ఉత్తరాది నుంచే రావడం ఆనవాయితీగా మారింది. దీనికి గల కారణాలను విశ్లేషిస్తే భిన్న రకాల వాదనలు వినిపిస్తాయి. సివిల్స్‌లో ఎక్కువ మంది అధికారులున్న తొలి పది రాష్ట్రాల్లో ఉత్తరాది నుంచి ఎనిమిది రాష్ట్రాలు ఉంటే దక్షిణాది నుంచి కేవలం రెండు రాష్ట్రాలు మాత్రమే ఉన్నాయంటే ఇందులో సివిల్స్‌లో ఉత్తరాది పట్టు ఏమిటో చెప్పుతున్నది. తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలు మాత్రమే తొలి పది స్థానాల్లో అడుగు భాగంలో దక్షిణాది నుంచి ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ నుంచి అత్యధికంగా 652 మంది సివిల్స్ విజేతులు ఉండగా, ఆ తర్వాత 439తో మధ్యప్రదేశ్, 415తో మహారాష్ట్ర, 378తో పశ్చిమ బెంగాల్, 376తో తమిళనాడు, 342తో బీహార్, 313తో గుజరాత్, రాజస్థాన్, అరుణాచల్‌ప్రదేశ్, గోవా, మిజోరాం లాంటి కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 316 మంది ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్‌లుగా ఎంపికై దేశవిదేశాల్లో సేవలందిస్తున్నారు. తొలి పది స్థానాల్లో ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాలకు చోటు దక్కలేదంటే ఈ పరీక్షలంటే మనకు అంతగా ఆసక్తి లేదని చెప్పుకోవచ్చు. ఉత్తరప్రదేశ్‌లోని మాధోపట్టి అనే గ్రామం నుంచి 51 మంది ఇప్పటి దాకా సివిల్స్‌లో ఎంపిక కావడంతో ఆ గ్రామం ఐఎఎస్, ఐపిఎస్‌ల ఫ్యాక్టరీగా చెబుతున్నారు. ఉత్తరాదిలోని తొమ్మిది రాష్ట్రాలు, దక్షిణాదిలోని ఐదు రాష్ట్రాలతో పోలిస్తే ఇప్పటివరకు సివిల్స్‌లో 80 శాతం మంది విజేతలు ఉత్తరాది నుంచే వస్తున్నారు. సివిల్స్‌కు ఎంపికై జీవితంలో స్థిరపడడం సుదీర్ఘ ప్రక్రియగా దక్షిణాది ప్రాంతాల వారు భావించడం మూలంగానే సివిల్స్ నుంచి ఎక్కువ మంది ఎంపిక కావడం లేదని విద్యావేత్తలు చెబుతున్నారు. ఉత్తరాదికంటే దక్షిణాది రాష్ట్రాల్లో ప్రైవేటు రంగంలో అత్యధిక వేతనాలు లభించే సాఫ్ట్‌వేర్ ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉండడం కూడా సివిల్స్ పట్ల తెలుగు వారి అనాసక్తికి మరో ముఖ్యకారణంగా చెబుతున్నారు. దీనికి తోడు ఈ పరీక్ష తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లోనే నిర్వహించడంతో జనాభా ఎక్కువ ఉన్న ఉత్తరాది విద్యార్థులకు హిందీ భాష కూడా ఎక్కువ మంది సివిల్స్‌ను జయించడానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. డిగ్రీ పూర్తి కాగానే త్వరగా ఉద్యోగం చూసుకుని, పెళ్ళి చేసుకుని తమ పిల్లలు సెటిల్ కావాలని తెలుగు రాష్ట్రాల తల్లిదండ్రులు భావిస్తున్నారు. అదే సివిల్స్‌లో విజేతలు కావాలంటే మూడు నుంచి నాలుగేళ్లు ఇంకా కాదంటే ఐదేళ్ళ వరకు కష్టపడితే తప్ప విజేతలు కాని పరిస్థితి ఉండడంతో దక్షిణాది వారు సివిల్స్‌లో వెనుకబడిపోతున్నారు. అయితే ఇటీవల కాలంలో సాఫ్ట్‌వేర్ రంగంలో ఏర్పడిన అనిశ్చితితో ఆ ఉద్యోగాలు వదిలి సివిల్స్‌కు దృష్టి మళ్లడం మూలంగా దక్షిణాది హవా ఇప్పుడే ప్రారంభమైందని చెప్పవచ్చు. ప్రతి సంవత్సరం సివిల్స్‌కు దక్షిణాది నుంచి ఎంపికయ్యే వారి శాతం పెరగడం గర్వకారణంగా చెప్పుకోవచ్చు. బుధవారం వెలువడిన సివిల్స్ పరీక్షల్లో తెలుగు రాష్ట్రాల నుంచి 60 మంది ఎంపిక కావడం మామూలు విషయం కాదు. దక్షిణాదితో పోలిస్తే ఈ సంఖ్య తక్కువే అయినా ప్రతి ఏడాది సివిల్స్ ఛేదిస్తున్న విద్యార్థుల శాతం పెరగడం ఆశావహ పరిణామంగా చెప్పవచ్చు.

## బీజేపీ, కాంగ్రెస్ తెలంగాణకు శత్రువులే..

# వాటిని ఓడించాల్సిందే...



**సూర్యాపేట/ భువనగిరి :** పదేండ్ల బీజేపీ పాలనలో ఏ వర్గానికి అయినా న్యాయం జరిగిందా అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రశ్నించారు. సూర్యాపేట, భువనగిరిలో పోరు బాట పేరుతో నేడు నిర్వహించిన బస్‌యాత్ర సభలో ఆయన మాట్లాడుతూ, మేక్ ఇన్ ఇండియా, సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్ వంటి పెద్ద పెద్ద నినాదాలు ఇచ్చారు.. వాటి వల్ల ఏమైనా లాభం జరిగిందా అని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా 18 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని.. వాటిని భర్తీ చేయడానికి మోదీ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు.

భేటీ బచావో %-% బేటీ పడావో అని నినాదమిచ్చారు.. మరి ఒక్క బేటీని అయినా బచాయించారా? ఒక్క బేటీ అయినా పడాయించారా? అని కేసీఆర్ ప్రశ్నించారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో ఎక్కడ చూసినా మహిళలపై దౌర్జన్యాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దళిత, పేద మహిళలపై దాడులే జరుగుతున్నాయని అన్నారు. దేశ చరిత్రలో ఏనాడు కూడా పడిపోని విధంగా రూపాయి విలువ రూ.83కి పడిపోయిందని తెలిపారు. అంతర్జాతీయంగా ఇదీ భారతదేశ గౌరవం.. ఇది బీజేపీ పరిపాలన ఫలితమని అన్నారు

ఒక పార్టీ ఏమో దేవుడి పేరు చెప్పి ఓట్లు అడుగుద్ది.. ఇంకో పార్టీ ఏమో ఏ ఊరికి వెళ్తే ఆ ఊరి దేవుడి మీద ఒట్లు పెట్టుకుంటుందని కేసీఆర్ విమర్శించారు. ఒకడేమో ఓట్లు.. ఒకడేమో ఒట్లు ఇదే రాష్ట్రంలో జరుగుతుందని విమర్శించారు. అద్భుతమైన యాదాద్రి దేవాలయాన్ని నిర్మించుకున్నాం.. కానీ ఏనాడైనా దాన్ని ఓట్ల కోసం వాడుకున్నామా? అని ప్రశ్నించారు. ఒకడొచ్చి బీజేపీకి బీఆర్ఎస్ బీటీమ్ అని కొంతమంది అంటున్నారని.. కానీ భువనగిరిలో ఏం జరిగిందని గుర్తుచేశారు. ఇక్కడ బీజేపీ, కాంగ్రెస్ మిలాఖత్ అయిపోయి.. బీఆర్ఎస్ చైర్మన్‌ను దించేశారని అప్పుడు కాంగ్రెస్ నుంచి చైర్మన్, బీజేపీ నుంచి వైఎస్ చైర్మన్ అయ్యారని చెప్పారు. మరి ఎవరికి ఎవరు బీ టీమ్ అని ప్రశ్నించారు.

ఇవాళ మోదీ ప్రభుత్వ హయాంలో రూపాయి విలువ పడిపోయింది.. మహిళలకు రక్షణ లేదు.. పేదరికం, నిరుద్యోగం పెరిగిపోతుంది.. ఇలా అనేక సమస్యలు ఉంటే, అదేమీ లేదన్నట్టుగా.. అక్షింతలు కలపాలి.. తీర్థం పుచ్చుకోవాలి, ప్రసాదం తినాలి, ఊరేగింపులు తీయాలి అన్నట్టుగా బీజేపీ తీరు ఉందని విమర్శించారు. ఈ అక్షింతలు, ఈ పులిహోర, ఈ తీర్థాలు, కాషాయ జెండాల ఊరేగింపులు మన కడుపు నింపుతుందా? అని ప్రశ్నించారు. మన పొలాలకు నీళ్లను తీసుకొస్తుందా అని నిలదీశారు.

ప్రతి బోర్‌కు మీటర్ పెట్టాలని.. లేదంటే నిన్ను పడగొడతా, నీ ఎమ్మెల్యేలను కొంటా అన్నట్టుగా మోదీ ప్రభుత్వం వ్యవహరించిందని కేసీఆర్ గుర్తు చేశారు. నా తలకాయ తెగిబడ్డాసరే రాష్ట్ర ప్రజలకు కరెంటు కావాలి? మీటర్ పెట్టనని స్పష్టం చేశానని చెప్పారు. ‘ ఇప్పుడు బీజేపీకి ఓటేస్తే ఏమంటారు.. మేం రైతుల మోటార్లకు మీటర్లు పెట్టాలని చెప్పినా కూడా మాకే ఓటేసింద్రు.. అందుకే తెల్లారి నుంచే మీటర్లు పెడతారు’ అని కేసీఆర్ అన్నారు. అందుకే రైతులు ఆలోచించుకోవాలని సూచించారు..

మోదీ వచ్చి రాగానే ఏడు మండలాలను తీసుకెళ్లి ఏపీకి ఇచ్చేశారని కేసీఆర్ తెలిపారు. 400 మెగావాట్ల సీలేరు ప్రాజెక్టును తీసుకెళ్లి ఆంధ్రాకు అప్పజెప్పారని మండిపడ్డారు. మోదీ లేకుండా, బీజేపీ లేకుండా ఏ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్న తెలంగాణకు బ్రహ్మాండంగా లాభం జరిగేదని అన్నారు. తెలంగాణ భారీగా నష్టపడ్డదే బీజేపీ కేంద్ర ప్రభుత్వం వల్ల అని వ్యాఖ్యానించారు. మళ్లీ సిగ్గులేకుండా ఓట్లు ఎలా అడుగుతున్నారని ప్రశ్నించారు. ఆనాడు తప్పిపోయి ఓటేస్తే నలుగురు ఎంపీలుగా గెలిచారు. వీళ్లు ఒక్క రూపాయి పనైనా చేశారా? ఇప్పుడు గెలిపిస్తే ఏం చేస్తారని విమర్శించారు. ‘ మా వయసు మీరిపోతుంది.. ఈ తెలంగాణ మీది.. భవిష్యత్తు మీది.. ఈ రాష్ట్రాన్ని ముందుకు నడిపేది మీరు.. పార్లమెంటులో ఏం జరుగుతుంది? ఎవరు గెలిస్తే మనకు మేలు జరుగుతుందనేది యువకులు ఆలోచించాలని’ చెప్పారు తెలంగాణకు 1956 నుంచి ఇప్పటి వరకు మనకు శత్రువే కాంగ్రెస్ పార్టీ అని.. ఉన్న తెలంగాణను ఊడగొట్టి ముంచిందే ఈ కాంగ్రెస్ పార్టీ అని కల్వకుంట్ల చంద్రశేఖరరావు విమర్శించారు. ’58 ఏళ్లు గోసపడ్డాం. భోనగిరి, ఆలేరు, జనగామ ప్రాంతం ఎంత గోసల ఉంటుండే. నీళ్ల వ్యాపారం ఉంటుండే. నీళ్లవ్యాపారాలు ఉంటుండే. బిందెలుపట్టుకొని మోసుడు ఉంటుండే. ఎన్ని బాధలు అనుభవించాం. వలసలు పోవడం, పట్నంపోవడం, ఆటోలు నడుపుకోవడం. మన వ్యవసాయాలను మూలకుపెట్టడం. ఇలా అనేక రకాల బాధలుపడ్డాం’ అంటూ గత కాంగ్రెస్ పాలనను కేసీఆర్ గుర్తు చేశారు.

‘ఆ నాడు ఎవరూ ధైర్యం చేయకపోయినా.. ఖచ్చితంగా తెలంగాణ లాభం జరగాలి. సొంత రాష్ట్రం కావాలి. బ్రహ్మాండంగా ఉండాలని నేను ఒక్కడినే పిడికెడు మందితో మిమ్మల్ని నమ్ముకొని ఉద్యమం ప్రారంభించాను. 15సంవత్సరాలు నిరాటంకంగా కొట్లాడి, చావునోట్లో తలకాయపెట్టి.. నిమ్స్ దవాఖానాలో నేను చచ్చిపోతనో.. బతుకుతనో అనే టైమ్ వరకు కొట్లాడితే తెలంగాణ రాష్ట్రం వచ్చింది. మీరంతా పులుల్లా కొట్లాడితే.. ఆ నాడు తలవంచి తెలంగాణ ఇచ్చింది. ఆ తర్వాత మనకు అధికారం వచ్చింది. కులం, మతం, జాతి వివక్ష లేకుండా అన్నివర్గాలకు మేలు జరగాలని చాలామంచి కార్యక్రమాలు చేసుకున్నాం. నేను తెచ్చిన రాష్ట్రంలో నా ప్రజలను తల్లి కోడిలా పిల్లలను కాపాడుకున్నట్లు అందరినీ కాపాడినం’ అన్నారు.

‘రైతులకు సంవత్సరానికి ఎకరానికి రూ.10వేలు ఇచ్చి బ్రహ్మాండంగా రైతుబంధు కార్యక్రమాన్ని భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా తెచ్చిన గవర్నమెంట్ బీఆర్ఎస్ గవర్నమెంట్. ఒక సంవత్సరంలోనే చెడిపోయిన కరెంటును మంచిగ చేసి.. 24గంటలు కరెంటు ఇచ్చుకున్నాం. నీళు ఇచ్చుకున్నాం. మన భువనగిరిలో బస్వాపూర్ ప్రాజెక్టును పూర్తి చేసుకున్నాం. నీళ్లు మీ అందరికీ వస్తయ్. ఆలేరు, భువనగిరి వస్తాయి. వడ్లు బ్రహ్మాండంగా మద్దతు ధర ఇచ్చి ఒక గింజకూడా లేకుండా కొనుగోలు కేంద్రాలు పెట్టి వడ్లు కొన్నాం. కొన్న వడ్ల పైసలు కూడా రైతులకు నేరుగా అకౌంట్లలో వేశాం’ అన్నారు.

## నిజాలు తెలుసుకొని మాట్లాడాలంటూ కాంగ్రెస్ పార్టీ హెచ్చరిక



**శామీర్ పేట, (గరుడ వార్త) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్న కేటీఆర్ నిజాలు తెలుసుకొని మాట్లాడాలంటూ మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి హెచ్చరించారు. మల్కాజ్గిరి పార్లమెంట్ బి ఆర్ ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ కార్యక్రమ రోడ్ షో కు హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అందజేసిన పథకాలపై, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. గురువారం శామీర్ పేట లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్లలో చేసిన సంక్షేమ పథకాలపై బీఆర్ఎస్ నాయకులు చర్చకు సిద్ధమాని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అక్రమాలకు, అవినీతికి పాల్పడుతూ డబ్బులు దండుకోవడమే ధ్యేయంగా పనిచేశారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజులేని ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఐదు ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులకు రైతుబంధు, రైతు బీమా, రూ 500 కే గ్యాస్ సిలిండర్ అందజేసిన ఘనత కాంగ్రెస్కే దక్కుతుందన్నారు. రూ 5 లక్షల ఆరోగ్యశ్రీ పథకం రూ 10 లక్షలకు పెంచామని తెలిపారు. మీ కుటుంబ సభ్యులు పూర్తి అవినీతిపరులని విమర్శించారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి డిపాజిట్ దక్కదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భరత్ కుమార్, ఊరడి వెంకటేష్, సతీష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 30 లోపు ఆస్తిపన్ను చెల్లించి ఐదు శాతం సబ్సిడీ సద్వినియోగం చేసుకోవాలి




**శామీర్ పేట, (గరుడ వార్త):** ఈ నెల 30 లోపు ఆస్తి పన్ను చెల్లించి ఐదు శాతం సబ్సిడీ సద్వినియం చేసుకోవాలని గురువారం మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము పన్ను చెల్లింపు దారులకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25 కు గాను ఏప్రిల్ 30 లోగా ఆస్తి పన్ను చెల్లించిన వారికి 5% తగ్గింపు స్కీము అమలులో ఉన్నందన్నారు. తూంకుంట పురపాలక సంఘ పరిధిలోని ప్రజలు తమ ఆస్తి పన్ను చెల్లించి 5% తగ్గింపు పొందాలని తెలిపారు. ఇందులో భాగంగా దేవరయాంజాల్ లోని జీవీకే ఈఎంఆర్ఐ వారు రూ. 13.11 లక్షలు, ఇతరులు రూ 6. 81 లక్షలు మొత్తము రూ: 19.92 లక్షలు ఒకరోజే వసూలు చేశామన్నారు. గడువు మరో 5 రోజులు ఉన్నందున పురపాలక సంఘం ప్రజలు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమములో జీవీకే ఈఎంఆర్ఐ ప్రతినిధులు, మున్సిపల్ డిప్యూటీ ఈ ఈ సునీత, బిల్ కలెక్టర్ రాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంతో యువకుడు మృతి..



**శామీర్ పేట, (గరుడ వార్త)** రోడ్డు ప్రమాదంతో యువకుడు మృతి చెందిన సంఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రం శామీర్ పేటకు చెందిన మహమ్మద్ మొయిన్ (26) చికెన్ సెంటర్ నడుపుతూ జీవిస్తున్నాడు. బుధవారం రాత్రి దొంగల మైసమ్మ నుంచి స్కూటీ పై శామీర్ పేట వైపుకు వస్తుండగా మార్గమధ్యం లోని రింగ్ రోడ్డు సర్కిల్ వద్ద వన్ లార్స్ ల్యాబ్ బస్సు డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపించి మొయిన్ ను ఢీకొట్టాడు.

దీంతో తీవ్ర గాయాలైన మొయిన్ ను 108 అత్యవసర వాహనంలో నగరంలోని గాంధీ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతు మొయిన్ తుది శ్వాస విడిచాడు. ఈ మేరకు శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మొత్తం 114 మంది అభ్యర్థులకు గాను 177 నామినేషన్లు దాఖలు అయ్యాయి

### - మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతం



**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :** పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ లో భాగంగా మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గ స్థానానికి చివరి రోజున (61) మంది అభ్యర్థులకు గాను (91) నామినేషన్లు వేయడం జరిగిందని మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గ స్థానానికి, ఈ నెల 18 నుండి 25 వరకు నిర్వహించిన నామినేషన్ల స్వీకరణ లో భాగంగా మల్కాజిగిరి నియోజకవర్గానికి (114) మంది అభ్యర్థులకు గాను (177) నామినేషన్లు పత్రాలు దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

గరుడ వార్త

శుక్రవారం, ఏప్రిల్ 26, 2024

# విభజన హామీల అమలులో ఏదీ సమాఖ్య స్ఫూర్తి...?




తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్ద కాలం ముగుస్తున్న తరుణంలో విభజన బిల్లులో రాష్ట్రానికి ఇచ్చిన హామీలు అరకొరగానే అమలవుతున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం హామీల అమలులో చిత్తశుద్ధి చూపించవలసి ఉంది. కేంద్రంలో ఎన్నో కీలక బిల్లులకు మద్దతు ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీ తాను అధికారంలో ఉన్నప్పుడు పలు హామీలను రాబట్టంలో విఫలమైంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే రేవంత్ రెడ్డి కేంద్రంతో సత్సంబంధాల కోసం సయోధ్యతో వ్యవహరించి రాష్ట్ర ప్రయోజనాలు కాపాడతామని, విభజన బిల్లులోని హామీలు అమలయ్యేట్టు కేంద్రంపై ఒత్తిడి తెస్తామని అన్నారు. బీఆర్ఎస్‌లా కాకుండా ఫెడరల్ స్ఫూర్తితో వ్యవహరిస్తామన్నారు. ఈ తరుణంలో కేంద్రం సానుకూలంగా బీజేపీ పాలిత రాష్ట్రంతో సమానంగా తెలంగాణను చూస్తుందని ఆశిద్దాం. విభజన బిల్లులో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలలోనూ కీలకమైనవి ఏవీ అమలుచేయక అరకొర మాత్రమే చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం ఉభయ రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి కాదు కదా కనీసం ప్రధాన ప్రతిపక్షంగా కూడా వచ్చే పరిస్థితి దరిదాపుల్లో కనిపించకపోవడమే అని జరుగుతున్న ప్రచారాన్ని ప్రజలు నమ్ముతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో బీజేపీకి విభజన బిల్లు రూపంలో బంగారం లాంటి అవకాశం లభించింది. గడిచిన పదేళ్ళల్లో బిల్లులో మంజూరు చేసిన, ఇచ్చిన హామీలను అమలు చేసి ఉంటే ఆ పార్టీకి కీలక రాజకీయపక్షంగా జెండా ఎగురవేసే అవకాశం లభించి ఉండేది. బిల్లులో తప్పొప్పుల గురించి మాట్లాడే బీజేపీ ఆనాడు వారి పరిశీలన తరువాతే దాన్ని పార్లమెంట్‌లో పెట్టిన అంశాన్ని కప్పిపుచ్చుతుంది. దాన్ని సరిచేసే అధికారం వచ్చి ఇన్ని సంత్సరాలైనా ఆ దిశగా ఏనాడూ పని చేయలేదు. విభజన చట్టంలోని సెక్షన్ 93లో కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ 13లో మంజూరు చేసిన అంశాలు కొత్త రాష్ట్రాలలో సుస్థిర అభివృద్ధి కోసం పదేళ్ళ లోపు ఏర్పాటు చేయాలని స్పష్టంగా నిర్దేశించింది. గిరిజన, హార్టికల్చర్ యూనివర్సిటీలను ఏర్పాటు చేయాలనీ నిర్దేశించారు. హార్టికల్చర్ యూనివర్సిటీకి కేవలం రూ.135 కోట్లు కేటాయించి మీరే ఏర్పాటు చేసుకోవాలని చేతులు దులుపుకున్నారు. విభజన బిల్లులో పెట్టినవన్నీ కేంద్రం ఏర్పాటు చేసేవి మాత్రమే. అలాంటప్పుడు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ హార్టికల్చర్ యూనివర్సిటీని రూ.1500కోట్లతో నిర్మించి ఐసీఆర్ క్రింద నిర్వహించాలి. కేసీఆర్ ప్రభుత్వం రూ.135కోట్లు తిరస్కరించి కేంద్రమే విద్యాలయాన్ని నిర్మించాలని పట్టుబట్టి ఉంటే ఫలితం మరోలా ఉండేదేమో. బయ్యారం ఉక్కు కర్మాగారం విషయంలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా విభజన జరిగిన ఆరు నెలలకే ఫీజిబిలిటీ రిపోర్ట్ ఇచ్చామని, రాష్ట్ర ప్రభుత్వం కోరిక మేరకు దీని సాధ్యాసాధ్యాలపై లోతైన పరిశీలన చేసేందుకు ఉక్కు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు నివేదిక సమర్పించలేదని చెప్పింది. మరోవైపు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బయ్యారంలో లభించే ఐరన్ ఓర్‌లో నాణ్యత లేదని, అందువలనే ప్లాంట్ ఏర్పాటు సాధ్యపడదని ప్రకటించారు. మరోవైపు ఉక్కు మంత్రిత్వ శాఖ డీపీఆర్ కోసం సమాచారం పంపాలని రాష్ట్ర ప్రభుత్వానికి పదమూడు సార్లు లేఖలు రాసినా స్పందన లేదని తెలియజేసింది. అసలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో ఎవరి మాట నమ్మాలి అనే మీమాంసలో ప్రజలు ఉన్నారు. తెలంగాణలో 4000 మెగా వాట్ల సామర్థ్యంతో ఎన్టీపీసీ ప్రాజెక్టును మంజూరు చేస్తూ అందుకు అవసరమైన కోల్ లింకేజీ కల్పించాలని విభజన బిల్లు ఆదేశించింది. కానీ ఇప్పటికి కేవలం 1600 మెగావాట్లు రూ.10,898కోట్లతో ఏర్పాటు చేసి మిగిలిన 2400 మెగావాట్లకు రూ.17,739 కోట్లతో 2016 మొదటి త్రైమాసిక ధరల ప్రకారం డీపీఆర్‌ను ?ఎన్టీపీసీ పెట్టుబడుల బోర్డు ప్రతిపాదించింది. 2023 ధరల ప్రకారం సవరించిన అంచనాలు రూపొందించాలి, వాటికీ పెట్టుబడుల ఆమోదం పొందాలి. దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నందున ఎన్టీపీసీ ఈ ప్రాజెక్ట్ రెండో దశను నిర్మించేందుకు పవర్ పర్చేస్ అగ్రిమెంట్ చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఎన్నో సంవత్సరాలుగా కోరుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదు. తాము ఇతర రాష్ట్రాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటామని హెచ్చరించటంతో ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించింది. దీని వల్ల రాష్ట్రానికి కేంద్ర పెట్టుబడులు, ప్రత్యక్ష పరోక్ష ఉపాధితోపాటు ఉత్పత్తి ఐయ్యే విద్యుత్‌లో 85శాతం రాష్ట్రానికే చెందుతుంది. జనవరిలో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ శక్తి పథకం క్రింద ఈ రెండవ దశ ప్రాజెక్టుకు సింగరేణి నుంచి బొగ్గును కేటాయించింది. రైల్వేశాఖకు సంబంధించి కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ నిర్మించాలనీ, హైదరాబాద్ – ఆంధ్రప్రదేశ్‌లోని నగరాల మధ్య ర్యాపిడ్ రైల్ కనెక్టివిటీ కోసం కొత్త రైల్వే లైన్ల నిర్మాణం చేయాలని స్పష్టంగా నిర్దేశించింది. తెలంగాణలో నాలుగు దశాబ్దాల నినాదం, కలగా మిగిలిపోయిన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీపై రైల్వేశాఖ చిన్నచూపు చూసిందనే చెప్పాలి. టీఆర్ఎస్ ప్రభుత్వంతోపాటు అన్ని పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి భూమి కేటాయింపు జరిపినా ముందుకు రాలేదు. ఈ మేరకు 2019 ఆగస్టుకు ముందే దేశంలో కోచ్ ఫ్యాక్టరీల అవసరం ఇప్పుడు లేదు, భవిష్యత్తులో కూడా పెట్టే ప్రసక్తి లేదు, అలాగే దేశంలో ఏటా అవసరమైన కోచ్‌ల కంటే మంజూరైన ఫ్యాక్టరీలలో ఎక్కువ కోచ్‌లు తయారవుతున్నాయని రైల్వే మంత్రిత్వ శాఖ స్పష్టంగా తెలిపింది. అంతేగాక భవిష్యత్తులో కూడా ఎట్టి పరిస్థితులలో తెలంగాణలో కోచ్ ఫ్యాక్టరీ పెట్టే అవకాశం లేదని రైల్వే బోర్డు 2020 తేల్చిచెప్పింది. హైదరాబాద్ – ఆంధ్ర రాజధాని, ఇతర నగరాలకు ర్యాపిడ్ రైల్వే సౌకర్యం ఏర్పాటు చేయాలని స్పష్టంగా విభజన చట్టంలో చెప్పినా సర్వే నిర్వహించాలన్న నిర్ణయానికి తొమ్మిదేళ్ళు పట్టింది. ఈ మేరకు ఈ ఏడాది ఫిబ్రవరిలో రైల్వే బోర్డ్ నిర్ణయం తీసుకుందని ఆర్టీఐకు సమాధానంగా సౌత్ సెంట్రల్ రైల్వే తెలిపింది. కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్, ఇతర తెలంగాణలోని ముఖ్య పట్టణాల నుండి ఆంధ్రప్రదేశ్ రాజధానికి ర్యాపిడ్ రోడ్ కనెక్టవిటీని ఏర్పాటు చేయాలన్న నిబంధన విషయానికొస్తే ఈ పదేళ్లలో రవాణా రహదారుల అభివృద్ధి సంస్థ రోడ్డు ప్రాజెక్టులను మంజూరు చేయలేదు, మంజూరైన వాటి నిర్మాణంలో పురోగతి లేదు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం తెలంగాణాకు 34, ఆంధ్రప్రదేశ్‌కు 50 అసెంబ్లీ స్థానాలు పెంచి పునర్విభజన చేయాలని నిర్దేశించినప్పటికీ రాజ్యాంగ సవరణ చేయనిదే పెంపుదల కుదరదన్న అటార్నీ జనరల్ అభిప్రాయాన్ని పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ఘంటాపథంగా చెప్పింది. కానీ జమ్మూ కశ్మీర్లో అర్టికల్ 370 రద్దు చేసిన తరువాత దేశంలోని అన్ని రాష్ట్రాలతో కశ్మీర్ రాజ్యాంగ పరంగా సమానం అయింది. బీజేపీ రాజకీయ ప్రయోజనాలు ఆశించి జమ్మూ కశ్మీర్ విభజన చట్టంలో 7 అసెంబ్లీ స్థానాలను పెంచుతూ తదనుగుణంగా డీలిమిటేషన్ కమిషన్ను ఏర్పాటు చేసింది. రాజకీయ పార్టీల ఇలాంటి వైఖరి వల్ల ప్రాంతాల మధ్య అనవసర విద్వేషాలు పెరుగుతాయి. విభజన హామీల అమలు విషయంలో నిజానికి కేంద్రంపై ఆర్థిక భారం లేదు.

## పెద్దమ్మ తల్లి బోనాలకు హాజరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**హన్మకొండ:** స్టేషన్ ఘనపూర్ మండలం ఇప్పగూడెం, చాగల్లు గ్రామాలలో నిర్వహించిన పెద్దమ్మ తల్లి బోనాలకు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఒకటి, రెండు రోజుల్లో దోస్త్ నోటిఫికేషన్




**హైదరాబాద్:** తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి వివిధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్దేశించిన 'డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్–తెలంగాణ(దోస్త్)' ఏప్రిల్ 27 లేదా మే 1న వెలువడే అవకాశం ఉంది. అదేసమయంలో 'దోస్త్' ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం కానుంది.
రాష్ట్రంలో ఏప్రిల్ 24న ఇంటర్‌మీడియట్ ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో.. ఉన్నత విద్యామండలి డిగ్రీ ప్రవేశ షెడ్యూలు ప్రకటించడానికి సన్నాహాలు చేస్తోంది. దోస్త్ పరిధిలో రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన యూనివర్సిటీల పరిధిలో 1054 డిగ్రీ కాలేజీలుండగా, వాటిలో 136 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు, నాన్ దోస్త్ కాలేజీలు 63 ఉన్నాయి. మిగిలినవి ప్రైవేట్ కాలేజీలు ఉన్నాయి. వీటిల్లో మొత్తం 3,86,544 డిగ్రీ సీట్లు అందుబాటులో ఉన్నాయి.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**విజయవాడ:** కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం చాగంటిపాడు పిల్లి వాని లంక కృష్ణా నది పాయలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం అయింది. సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయసు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. సుమారు పది రోజులు క్రితం చనిపోయి ఉండొచ్చని పోలీసులు అనుమానం. మృతుడి వంటిపై దుస్తులు లేవు. మృతుడి సమీపంలో లుంగి, చెప్పులు ఉన్నట్లు గమనించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సంక్షేమ పథకాలు పాలన సాగాలంటే మరోసారి జగన్ సీఎం కావాలి - మన గుర్తు ఫ్యాన్



**ఎమ్మిగనూరు:** పట్టణంలో 15వ వార్డు లో ఎమ్మిగనూరు నియోజకవర్గ వైయస్ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రేణుక ఆదేశాల మేరకు కొండాపూర్ ఇసాక్ గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి గడిచిన ఈ ఐదేళ్ల వైఎస్ జగన్ అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి... ప్రతి కుటుంబానికి జగన్ పాలనలో లబ్ధి చేకూరిందని అన్నారు. ఒకవైపు పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే, మరోవైపు రాష్ట్ర అభివృద్ధికి జగన్మోహన్ రెడ్డి కృషి చేశారని ఎమ్మెల్యే అభ్యర్థి అయిన బుట్ట రేణుకమ్మ గారికి, ఎంపీ అభ్యర్థి అయిన బి వై రామయ్య కు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డ్ ×కౌన్సిలర్ కొండపురి ఇసాక్ 15 వ వార్డ్ యూత్ నాయకులు వార్డ్ ఇన్చార్జులు మరియు బూత్ కన్వీర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నల్గొండ లోక్ సభ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ...!




**నల్గొండ :** నల్గొండ లోక్ సభ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకొంది. సిట్టింగ్ సీటును కాపాడుకునేందుకు కాంగ్రెస్ శ్రమిస్తుంటే మోదీ చరిష్మాతో గెలిచేందుకు బీజేపీ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తుంది. ఈసారి గెలుపు మాదేనంటూ బీఆర్ఎస్ అంటోంది.నల్గొండ లోక్ సభా నియోజకవర్గంలో విజయం కోసం మూడు ప్రధాన రాజకీయ పార్టీలు సర్వ శక్తులు ఒడ్డుతున్నాయి. నల్గొండ లోక్ సభ నియోజకవర్గానికి ఇప్పటి వరకు 17 పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. మొత్తంగా వామపక్షాలు 8 సార్లు, కాంగ్రెస్ 6, టీడీపీ 2, టీఆర్ఎస్ 1 సారి చొప్పున ఇక్కడ గెలిచాయి. ప్రస్తుత శాసన మండలి ఛైర్మన్ గా ఉన్న గుత్తా సుఖేందర్ రెడ్డి ఒకసారి టీడీపీ నుంచి మరో రెండు సార్లు (2009, 2014)లో కాంగ్రెస్ నుంచి మొత్తంగా మూడు సార్లు ఎంపీగా విజయం సాధించిన నేతగా రికార్డు నెలకొల్పారు. కాగా, ఈ సారి ఎన్నికల్లో ఈ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి తనయుడు కుందూరు రఘువీర్ రెడ్డి, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నుంచి కంచర్ల క్రిష్ణారెడ్డి, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నుంచి మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పోటీ పడుతున్నారు. నల్గొండ ఎంపీ స్థానం కాంగ్రెస్ సిట్టింగ్ స్థానం కావడంతో తమ సీటును కాపాడుకునేందుకు కాంగ్రెస్ శ్రమిస్తోంది. మూడు పార్టీలు గెలుపు కోసం ప్రయత్నిస్తుండడంతో ఇక్కడ త్రిముఖ పోటీ ఏర్పడింది.నల్గొండ ఎంపీ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్ తీవ్రంగానే శ్రమిస్తోంది. ఈ స్థానం నుంచి వరసగా గెలుస్తూ వస్తున్న కాంగ్రెస్ తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014, 2019 ఎన్నికల్లోనూ ఆ పార్టీ గెలిచింది. 2024 ఎన్నికల్లోనూ విజయం సాధించడంపై దృష్టి పెట్టింది. గత ఎన్నికల్లో ప్రస్తుత మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఋంపీగా విజయం సాధించారు. కాగా ఈ సారి పార్టీ సీనియర్ నాయకుడు కె.జానారెడ్డి పెద్ద కుమారుడు రఘువీర్ రెడ్డికి(ఐ టికెట్ లభించింది. నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆరింట కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారు. సూర్యాపేటలో బీఆర్ఎస్ నుంచి జగదీష్ రెడ్డి విజయం సాధించగా, కోదాడ, హుజూర్ నగర్, మిర్యాలగూడ, నాగార్జున సాగర్, దేవరకొండ, నల్గొండ ల్లో కాంగ్రెస్ గెలిచింది. దీంతో ఈ అంశం తమకు లాభిస్తుందని, కచ్చితంగా గెలిచి తీరుతామన్న ధీమాలో కాంగ్రెస్ ఉంది. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి పలువురు స్థానిక నాయకులు ఆయా నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ లోకి వలస వెళుతున్నారు. దీంతో క్షేత్ర స్థాయిలో బలంగా తయారయ్యామన్న ధీమాలో ఆ పార్టీ ఉంది.బీజేపీ ఈ ఎన్నికల్లో నల్గొండ సీటును దక్కించుకుంటామన్న ఆశలో ఉంది. ఆ పార్టీ ముందు నుంచి తమ పార్టీలో ఉన్న నాయకులకు కాకుండా ఎన్నికల ముందే తమ పార్టీ తీర్థం పుచ్చుకున్న, బీఆర్ఎస్ నాయకుడు, హుజూర్ నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డికి టికెట్ ఇచ్చింది. ఈ నియోజకవర్గంలో బీజేపీకి నామమాత్రంగా కూడా పట్టులేకున్నా, కేంద్రంలో ఈసారి మళ్లీ అధికారంలోకి వచ్చేది బీజేపీ అని, మోదీ మూడో సారి ప్రధాని అవుతారని ప్రచారం చేస్తూ.. మోదీ( చరిష్మాతో గట్టెక్కుతామన్న ధీమాలో ఉంది. 2014 ఎన్నికల్లో టీడీపీతో ఉన్న పొత్తులో భాగంగా ఈ సీటులో బీజేపీ పోటీ చేయలేదు.

## విషతుల్యమవుతున్న పాలు అధిక ఉత్పత్తి కోసం డెయిరీల అడ్డదారులు



**బచ్చన్నపేట :** అనేక రకాల పోషకాలు లభిస్తాయనే నమ్మకంతో అందరూ పాలు తాగుతారు. ముఖ్యంగా పిల్లలు, అనారోగ్యం బారిన పడినవారు, బలహీనంగా ఉన్నవారు పాలు తాగితే ఆరోగ్యం బాగుంటుందని వైద్యులు సూచిస్తుంటారు. కానీ పాలు సైతం విషతుల్యమవుతున్నాయనేది చేదునిజం. అధిక పాల ఉత్పత్తి కోసం పాడి పశువుల డెయిరీలను నిర్వహిం చే వారు అడ్డదారులు తొక్కుతున్నారు. అత్యాశతో అధిక పాల ఉత్పత్తి కోసమంటూ పశువులకు ఇంజక్షన్‌లు చేయిస్తున్నారు. గ్రామాల్లో గాలికుంటు వ్యాధి బారిన పడితేనే రైతులు పది రోజుల పాటు పశువులకు పాలుపిండి పారబోస్తారు. అట్లాంటిది అధిక పాలకోసం హార్మోన్ ఇంజక్షన్‌లు ఇస్తూ విషతుల్యమవుతున్న పాల ఉత్పత్తికి తెరలేపుతున్నారు డెయిరీ నిర్వాహకులు. పాలల్లో వెన్నశాతంలో తేడాలు చూపేందుకు ఉప్పు, యూరియా లాంటివి మిళితం చేస్తున్నారు. ప్రజారోగ్యానికి ముప్పు అని తెలిసినా తమ స్వార్థానికి, లాభార్జన కోసం అడ్డదారుల్లో వెళుతున్నారు. పెంపకందారుల అత్యాశ పాడి పశువులకు ప్రాణంతకంగా పరిణమిస్తోంది. రెట్టింపు పాల కోసం గేదెలకు, పాడి ఆవులకు అక్సిటోసిన్ ఇంజక్షన్‌లు ఇప్పించటంతో పాటు, ఈ మధ్య కాలంలో బీరు వ్యర్థ ద్రావకాలను ట్యాంకర్ల ద్వారా తెప్పించుకుని మరీ పాడి పశువులకు తాగిస్తున్నారు. బీరు వ్యర్థాన్ని తాగించి మూగజీవుల జీవిత కాలాన్ని హరించి వేస్తున్నారు. వాటి పునరోత్పత్తి సామర్థ్యం కోల్పోయేలా చేస్తున్నారు. ఇంజక్షన్‌లతో పాటు, వ్యర్థాలు సేవించిన పశువుల పాలు తాగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని వైద్య వర్గాలు హెచ్చరిస్తున్నాయి. బీరు పరిశ్రమలోని వ్యర్థ పదార్థమైన గోధుమ పిప్పి(స్పెంట్‌మాల్ట్)ను పాడి పశువులకు దాణాగా ఉపయోగించి అధిక పాల ఉత్పత్తిని సాధించవచ్చని కొందరు వ్యాపారులు రైతుల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ మాయలో పడిన కొందరు రైతులు తమ జీవనాధారమైన పశువులకు విషపు దాణా పెడుతున్నారు. పాలు ఎక్కువ ఇస్తాయని ఆశపడి బీరు తయారీలో మిగిలే వ్యర్థమైన పొడిని తినిపించి తమకు తామే నష్టం కలుగజేసుకుంటున్నారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న దళారులు కాసులు పండించుకుంటున్నారు.

# నాడు ఫుల్‌పేజీ ప్రకటనలిచ్చారు.. మరి క్షమాపణలు..



న్యూఢిల్లీ : క్షమాపణలు చెబుతూ వార్తా పత్రికల్లో ఇచ్చిన ప్రకటనలు, ఉత్పత్తులకు సంబంధించి గతంలో మీరు ఇచ్చిన ఫుల్ పేజీ ప్రకటనలకన్నా పరిమాణంలో పెద్దవా.. ఖరీదైనవా? అని పతంజలి ఆయుర్వేద్ సంస్థను, దాని సహ వ్యవస్థాపకులు, యోగా గురు బాబా రామ్‌దేవ్‌ను సుప్రీంకోర్టు మంగళవారం ప్రశ్నించింది. తమ ఆయుర్వేద ఉత్పత్తుల గురించి అభ్యంతరకరమైన, తప్పుదోవ పట్టించేవిధంగా ప్రకటనలను ప్రచురించినందుకు సుప్రీంకోర్టు ధిక్కార చర్యను పతంజలి, బాబా రామ్‌దేవ్, అతని సహచరుడు ఆచార్య బాలకృష్ణ ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. తప్పుదోవ పట్టించే ప్రకటనలు నిలిపివేస్తామని గత ఏడాది నవంబరులో సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీని కూడా ఉల్లంఘించారు. వారు సమర్పించిన అఫిడవిట్లపై కూడా సుప్రీంకోర్టు అసంతృప్తిగా ఉంది. గత విచారణలో వీరు ముగ్గురూ బహిరంగ క్షమాపణలు చెబుతామని కోర్టుకు తెలిపారు. దీని గురించి మంగళవారం విచారణలో వివరాలు వెల్లడిస్తూ దేశవ్యాప్తంగా 67 వార్తాపత్రికల్లో క్షమాపణలు ప్రచురితమయ్యాయని వారి తరుపున న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టుకు తెలిపారు. పది లక్షల రూపాయలు ఖర్చయ్యాయని చెప్పారు. దీనికి జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ 'క్షమాపణలు చెబుతూ మీరు ఇచ్చిన ప్రకటనలు గతంలో ఇచ్చిన ఫ్రంట్ పేజీ ప్రకటనల కంటే పెద్దవా.. వాటి కంటే ఎక్కువ ఖర్చయిందా' అని ప్రశ్నించింది. ప్రచురించిన క్షమాపణలు యొక్క 'బ్లో-అప్' కాపీలను కంపైల్ చేసి రిపోర్టు ఇవ్వాలని కోరింది. 'క్షమాపణలు ప్రచురించిన వార్తపత్రికల వాస్తవ కాపీలను చూడాలనుకుంటున్నాం. ఏ పేజీలో ప్రచురించారు. ఎప్పుడు ప్రచురించారు అనే విషయాలను తెలుసుకోవాలనుకుంటున్నాం' అని తెలిపింది. ఈ వివరాలను సమర్పించేందుకు ఈ నెల 30 వరకూ న్యాయవాది రోహత్గీకి సమయం ఇచ్చింది. ఈ సందర్భంగా కేంద్రానికి కూడా ధర్మాసనం మొట్టికాయలు వేసింది. అభ్యంతరకరమైన ప్రకటనలపై చర్యలు తీసుకునే డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ రూల్స్ 1945లో రూల్ 170ను ఈ కేసులో విస్మరించడంపై కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ నుంచి ధర్మాసనం వివరణ కోరింది.

## ఇంటర్ ఫలితాలు.. ఏడుగురు విద్యార్థుల ఆత్మహత్య



**హైదరాబాద్:** తెలంగాణ లో ఇంటర్ ఫలితాలు వెల్లడైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాము పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని ఆరుగురు విద్యార్థులు మనస్తాపంతో ఆత్మహత్య చేసకోవడం కలకలం రేపింది. మరో విద్యార్థిని ఫెయిలవుతాననే భయంతో ఫలితాలకు ముందే బలవన్మరణానికి పాల్పడింది. ఇక వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం కొల్లూర్‌కు చెందిన సాయితేజ గౌడ్ (17), హైదరాబాద్ అత్తాపూర్‌కు చెందిన హరిణి, ఖమ్మం జిల్లా ముదిగొండకు చెందిన వాగదాని వైశాలి, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామానికి చెందిన చిప్పా భార్గవి, మంచిర్యాల జిల్లా దొరగారిపల్లెకు చెందిన గట్టిక తేజస్విని, మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం అచ్చులాపూర్ గ్రామానికి చెందిన మైదం సాత్విక్.. వీళ్లందరూ కూడా ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇక సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం పతూరు గ్రామానికి చెందిన శ్రీజ అనే ఒకేషనల్ ఫస్ట్ ఇయర్ విద్యార్థిని.. ఫెయిలవుతాననే భయంతో మంగళవారం రాత్రి పురుగుల మందు తాగింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. కానీ పరీక్ష ఫలితాలు చూస్తే ఆమె పాసైంది. ఇంటర్ ఫలితాల వల్ల రాష్ట్రంలో ఇలా ఏడుగురు విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడంటతో వాళ్ల కుటుంబాల్లో తీరని శోకం మిగిల్చారు.

## వీసా పొడిగింపు వివాదంతో భారత్ వీడిన ఆస్ట్రేలియా జర్నలిస్ట్



వీసా గడువు పొడిగించడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరించడం, ఆస్ట్రేలియా ప్రభుత్వం జోక్యం అనంతరం పొడిగించినా, ఆ విషయాన్ని సకాలంలో తెలియజేయకపోవడంతో ఆస్ట్రేలియా జర్నలిస్టు అవనీ దియాస్ భారతదేశం నుంచి స్వదేశం వెళ్లిపోవాల్సివచ్చింది. భారత్‌లో లోక్‌సభ ఎన్నికలు ప్రారంభమైన ఈ నెల 19న భారతదేశాన్ని విడిచిపెట్టాల్సి వచ్చిందని మంగళవారం అవని దియాస్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఆస్ట్రేలియా బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ దక్షిణాసియా బ్యూరో చీఫ్‌గా అవనీ దియాస్ బాధ్యతలు నిర్వహించేవారు. తన రిపోర్టింగ్ 'హద్దులు దాటింది' అని ఆరోపిస్తూ తన వీసా పొడిగింపును మోడీ ప్రభుత్వం నిరాకరించిందని చెప్పారు. తనకు ఎన్నికల అక్రిడిటేషన్ కూడా రాదని అధికారులు చెప్పారని ఆమె తెలిపారు. మోడీ గొప్పగా చెప్పే 'ప్రజాస్వామ్య తల్లి' దేశంలో లోక్‌సభ ఎన్నికలు ప్రారంభమైన రోజున ఆ దేశాన్ని వీడాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు.

## భారత విద్యార్థులకు నాసా అవార్డులు...




అమెరికాకు చెందిన అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' నిర్వహించిన హ్యూమన్ ఎక్స్ ప్లోరేషన్ రోవర్ చాలెంజ్‌లో మన విద్యార్థులు సత్తా చాటారు.న్యూఢిల్లీ ముంబైకి చెందిన భారతీయ విద్యార్థుల బృందాలు నాసా అవార్డులను గెలుచుకున్నాయి. అలబామా రాష్ట్రంలోని హంట్స్ విల్లేలో ఉన్న అమెరికా అంతరిక్ష రాకెట్ కేంద్రంలో ఈ నెల 19, 20 తేదీల్లో ఈ పోటీలు జరిగాయి. ఢిల్లీకి చెందిన కేఐఈటీ గ్రూప్ విద్యాసంస్థకు చెందిన స్టూడెంట్స్ క్రాష్ అండ్ బర్న్ విభాగంలో అవార్డును గెలుచుకున్నట్లు నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ ప్రకటించింది. అలాగే ముంబైకి చెందిన ద కనాకియా ఇంటర్నేషనల్ స్కూల్ కు చెందిన విద్యార్థులు రూకీ ఆఫ్ ద ఇయర్ అవార్డును గెలుచుకున్నారు.

## పార్లమెంట్‌లో కార్మిక గొంతు ఎలమారం కరీం...!



కేరళలో కోజికోడ్ లోక్‌సభ నియోజకవర్గానికి సీపీఐ(ఎం) తరపున పోటీ చేస్తున్న ఎలమారం కరీం తన రాజకీయ జీవితాన్ని కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలతో ప్రారంభించారు. ఆయన గొప్ప పార్లమెంటేరియన్. పార్లమెంట్‌లో కార్మిక గొంతుగా నిలిచిన ఎలమారం కరీం, ఇప్పుడు లోక్‌సభకు పోటీ చేస్తున్నారు. శ్రామిక వర్గ రాజకీయాల సూక్ష్మబేధాలను ప్రజలకు తెలియజేసే అద్భుతమైన వక్తృత్వ శైలి ఉన్న కరీం, దేశంలోనే పేరున్న ట్రేడ్ యూనియన్ నాయకుడుగా ఉన్నారు.ప్రస్తుతం రాజ్యసభ ఎంపీగా ఉన్న ఎలమారం పార్లమెంట్‌లో లౌకిక భారతదేశానికి బలమైన గొంతుక. సీపీఐ(ఎం) రాజ్యసభ నాయకుడుగా కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు, ఫాసిస్టు చర్యలను వ్యతిరేకించినందుకు ఆయనను రెండుసార్లు పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేశారు. సభలో ప్రతిపక్ష పార్టీలను సమన్వయం చేస్తూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో ఆయన కీలకపాత్ర పోషించారు.

## దేశం కోసం మా అమ్మ తాళినే త్యాగం చేసింది



న్యూఢిల్లీ: దేశం కోసం మా అమ్మ మంగళ సూత్రాన్నే త్యాగం చేసిందంటూ ప్రధాని మోడీ వ్యాఖ్యలను ప్రియాంక గాంధీ ఘాటుగా స్పందించారు. కర్ణాటక రాజధాని బెంగళూ రులో జరిగిన బహిరంగ సభలో ప్రియాంక మాట్లాడుతూ.. "గత రెండు రోజులుగా కాంగ్రెస్ వాళ్లు మీ మంగళసూత్రం, బంగారం లాక్కోవాలనుకుంటున్నారని బిజెపి నేతలు ప్రచారం చేస్తున్నారు. ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు అయ్యింది, 55 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది, అప్పుడు ఎవరైనా బంగారం లాక్కున్నారా? మీ మంగళ సూత్రాన్ని గుంజుకున్నారా? దేశంలో యుద్ధం జరిగినప్పుడు, ఇందిరా గాంధీ తన బంగారాన్ని దేశానికి అందించారు. ఈ దేశం కోసం నా తల్లి మంగళసూత్రాన్ని (రాజీవ్ గాంధీని) త్యాగం చేశారు." అని అన్నారు. "మంగళసూత్రం' ప్రాముఖ్యతను మోడీజీ అర్థం చేసుకుని ఉంటే ఇలాంటి మాటలు మాట్లాడేవారు కాదు.. నోట్ల రద్దు జరిగినప్పుడు మహిళల పొదుపు సొమ్మును ఎత్తుకెళ్లారు.. రైతుల నిరసనలో 600 మంది రైతుల ప్రాణాలు బలిగొన్నారు. ఆ రైతుల ఇల్లాలి 'మంగళసూత్రం' గురించి ఆలోచించాడా? మణిపూర్‌లో మహిళను వివస్త్రగా ఊరేగించినప్పుడు, ఆమె 'మంగళసూత్రం' గురించి ఆయన ఆలోచించాడా? ఈరోజు మహిళలను భయపెట్టడానికి అలాంటి మాటలు మాట్లాడుతున్నాడు. వారు భయపడి ఓటు వేస్తారని భావిస్తున్నాడు" అని అన్నారు.

## మలేరియా రహిత భారతాన్ని నిర్మించలేమా...!

ప్రపంచవ్యాప్తంగా ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు 2007 నుంచి 25 ఏప్రిల్ రోజున 'ప్రపంచ మలేరియా దినం' నిర్వహించుట ఆనవాయితీగా వస్తున్నది. 2000 సంవత్సరం నుంచి మలేరియా నిర్మూలన, రోగ నిర్ధారణ, వైద్యరంగాల్లో ప్రపంచ దేశాలు గుణాత్మక ఫలితాలను సాధించి పిల్లలతో పాటు పెద్దలను మలేరియా నుంచి కాపాడటం జరుగుతోంది. ప్రతి ఏట ప్రపంచవ్యాప్తంగా 106 దేశాల్లో 3.3 బిలియన్ల మలేరియా అంచున ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. 2021లో విశ్వవ్యాప్తంగా 6.27 లక్షల మలేరియా కారణ మరణాలు జరుగుతుండడం విచారకరం. గత రెండు దశాబ్దాలుగా 7 మిలియన్ల ప్రజలను మలేరియా నుంచి కాపాడటం, ఒక బిలియన్ జనులకు మలేరియా సోకకుండా జాగ్రత్తలు చర్యలు తీసుకోవడం జరిగింది. ప్రపంచ మలేరియా దినం -2024 నినాదంగా 'మలేరియా నిర్మూలనలో ప్రపంచవ్యాప్తంగా సమానంగా మార్పు దిశగా వేగవంతమైన అడుగులు' అనే అంశాన్ని తీసుకొని సామాన్యులకు అవగాహన కల్పిస్తున్నారు. రాబోయే రోజుల్లో దాదాపు అన్ని ప్రపంచ దేశాలు 'జీరో మలేరియా' దేశాలుగా రూపాంతరం చెందే దిశలో అడుగులు వేయడం సంతోషదాయకం. ప్లాస్మోడియం పరాన్నజీవి వల్ల సంక్రమించే మలేరియా ప్రాణాంతకమైన వ్యాధిగా గుర్తించబడింది. ఆడ అనాఫిలిస్ దోమ కాటు వల్ల మానవులకు సోకే మలేరియా వల్ల అభివృద్ధి చెందుతున్న భారత్ లాంటి అధిక జనాభా కలిగిన దేశాల్లో ప్రమాదకరంగా మారడం విచారకరం. విశ్వవ్యాప్తంగా గత నాలుగు సంవత్సరాలుగా ప్రతి ఏటా 229 మిలియన్ల ప్రజలు కొత్తగా మలేరియా బారిన పడుతున్నారని 'ప్రపంచ మలేరియా నివేదిక-2020' తేల్చింది. 2019లో 4.09 లక్షల మలేరియా మరణాలను ప్రపంచవ్యాప్తంగా గమనించారు. ప్రపంచ మలేరియా నివేదిక ప్రకారం 2021 ప్రకారం ప్రపంచ మలేరియా కేసుల్లో 95 శాతం ఆఫ్రికా దేశాల్లోనే బయట పడటమా కాకుండా 96 శాతం మరణాలు రికార్డు కావడం జరిగింది. ప్రపంచ దేశాలు మలేరియా నిర్మూలనకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాయని, కొన్ని దేశాలు 'మలేరియా రహిత దేశాలు'గా ప్రకటించబడ్డాయని ఐక్యరాజ్యసమితి అభినందన పూర్వకంగా హర్షాన్ని వ్యక్తం చేసింది. వరుసగా 3 ఏండ్ల పాటు మలేరియా కేసులు నమోదుకాని దేశాలను 'మలేరియా రహిత దేశాలు'గా ఐరాస ప్రకటిస్తున్నది. 2007లో యూఏఈ, 2016లో శ్రీలంక లాంటి 9 దేశాలు, నేడు 43 దేశాలను ఐరాస జీరో మలేరియా దేశాలుగా ప్రకటించింది. 2025 నాటికి మరి కొన్ని దేశాలు మలేరియా రహిత దేశాల జాబితాలో చేరేందుకు పటిష్టమైన కార్యాచరణ అమలు పరుస్తున్నాయి. 2019లో మలేరియా కేసులు బయట పడుతున్న 87 దేశాల్లో 46 దేశాలు 10 వేల కన్న తక్కువ కేసులను నమోదు చేశాయని, 2000లో 26 దేశాలు మాత్రమే ఉన్నాయని ఐరాస గుర్తు చేసింది. 2020 నాటికి మరో 24 దేశాలు గత 3 ఏండ్లుగా మలేరియా కేసులు నమోదు కాలేదని, వీటిలో 11 దేశాలు మలేరియా రహిత దేశాల జాబితాలో చేరాయని వివరించింది. చైనా, ఇరాన్, మలేషియా లాంటి మరో 8 దేశాలు 2020 నాటికి 'జీరో మలేరియా' దేశాలుగా గుర్తించబడినవి. భూటాన్, కోస్టారికా, నేపాల్‌లు ఏడాదికి 100 లోపు కేసుల నమోదుతో మలేరియా రహిత దేశాల జాబితాలో చేరేందుకు సిద్ధంగా ఉన్నాయి. 1947లో భారత్ జనాభా 330 మిలియన్లు ఉండగా, అందులో ప్రతి ఏటా 75 మిలియన్ల ప్రజలకు మలేరియా సోకడం జరిగింది. ప్రపంచ మలేరియా కేసుల్లో 3 శాతం వరకు భారత్‌లో నమోదు అవుతున్నాయి. 1994లో కేసుల సంఖ్య 2.51 మిలియన్, మరణాలు 0.99 మిలియన్ గుర్తించారు. 2019లో 2.86 లక్షల కేసులు నమోదు కాగా, అక్టోబర్-2020 వరకు 1.57 లక్షల మలేరియా కేసులు నమోదైనాయి. 2000లో 29,500 మరణాలు నమోదు కాగా 2019లో మలేరియా మరణాల సంఖ్య గణనీయంగా పడిపోయి 7,700 లకు చేరడం శుభ పరిణామంగా గుర్తించారు. ఇండియాలో మలేరియా లాంటి 'వాహక జీవి ద్వారా కలిగే వ్యాధి (వెక్టర్ బార్న్ డిసీజెస్)' జాబితాలో డెంగ్యూ, ఫైలేరియాసిస్, కాలా-అజర్, జపనీస్ ఎన్సిఫలైటిస్, చికెన్ గున్యా లాంటి ప్రమాదకర రోగాలు దేశ వైద్యరంగానికి సవాళుగా నిలిచాయి. ఐరాస రూపొందించిన 'ప్రపంచ మలేరియా నివేదిక-2020' గణాంకాల ప్రకారం ఇండియాలో మలేరియా నివారణ చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని తేల్చింది. 2018 గణాంకాలతో పోల్చితే 2019లో మలేరియా కేసులు 21.3 శాతం, మరణాలు 20 శాతం తగ్గాయని తెలుస్తున్నది. ఇండియాలో 2000-19 మధ్య రెండు దశాబ్దాల కాలంలో మలేరియా కేసులు 83.34 శాతం, మరణాలు 92 శాతం తగ్గడంతో 'మిలినియమ్ డెవలప్‌మెంట్ గోల్స్ - 6' సాధించటంలో సఫలమైనట్లు గమనించారు. మన దేశంలో పశ్చిమ బెంగాల్, ఝార?ండ్, ఛత్తీస్‌గఢ్, యంపీల్లో అధిక మలేరియా కేసులను గమనించి, 'హై బర్డన్ టు హై ఇంపాక్ట్' ప్రణాళికలను అమలుపరిచారు. 2027 నాటికి ఇండియాను 'మలేరియా రహిత దేశం'గా ప్రకటించడానికి అనేక పటిష్ట కార్యక్రమాలను ప్రభుత్వాలు చేపట్టడం జరుగుతోంది. మలేరియాకు కారణమైన దోమ కాటును నివారించడం ప్రథమ కర్తవ్యంగా బావించాలి. దోమ కాటు నివారణకు దోమ తెరలు, దోమలను వికర్షించే క్రీమ్‌లు/ద్రవాలు/కాయిల్స్/మ్యాట్స్ వాడటం, శరీర అవయువాలు కప్పుకునేలా దుస్తువులు ధరించడం, డోర్‌లకు నెట్స్ అమర్చుకోవడం లాంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి మురికి నీటి నిల్వలు లేకుండా స్వచ్ఛ భారత్ నిర్వహించడం లాంటివి మలేరియా నిర్మూలనకు దోహదపడతాయి. మలేరియా నివారించదగిన వ్యాధి. సరైన అవగాహనతో అడ్డుకట్ట వేయడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది. మలేరియా సోకినా భయపడకుండా అందుబాటులో ఉన్న సరైన చికిత్సతో సకాలంలో వైద్య సలహాలు తీసుకుంటే ప్రాణాపాయం తప్పుతుంది. కరోనా విపత్తు విజృంభనతో మలేరియా లాంటి ప్రాణాంతక వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం చెల్లించాల్సి రావచ్చని మరువరాదు.

# గుండె జబ్బులు ఉన్నవారు తీపి పదార్థాలు తినొచ్చా......?




ఉరుకులు పరుగుల జీవితం.. ఎన్నో సమస్యలు వెంటాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యం.. అయితే.. ముఖ్యంగా తీపి పదార్థాలు అనారోగ్య సమస్యలను పెంచుతున్నాయి. వాస్తవానికి ఎక్కువ చక్కెర తినడం ఎవరికైనా చాలా హానికరం. స్వీట్లు తినడం వల్ల బరువు పెరగడం, డిప్రెషన్, చర్మ సంబంధిత సమస్యలు వస్తాయి. అయితే, హార్ట్ పేషెంట్ (హృదయ రోగులు) స్వీట్లు తినాలా అనే ప్రశ్న తరచూ తలెత్తుతుంది.. హార్ట్ పేషెంట్ తీపి పదార్థాలు తినొచ్చో లేదో ఇప్పుడు తెలుసుకోండి.. వాస్తవానికి గుండె రోగి రోగనిరోధక శక్తి చాలా బలహీనంగా ఉంటుంది. అందువల్ల స్వీట్లు తినడం వల్ల ఇతర తీవ్రమైన వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. మిఠాయిలు ఎక్కువగా తినడం వల్ల ట్రైగ్లిజరైడ్స్ స్థాయి పెరుగుతుంది. ఇది ఒక రకమైన కొవ్వు పదార్థం.. ఇది గుండె సమస్యను మరింత పెంచుతుంది. అధిక మొత్తంలో చక్కెర ఉన్న ఆహార పదార్థాలను తినడం వల్ల హై బీపీ రిస్క్ పెరుగుతుంది. అధిక రక్తపోటుతో బాధపడే వారికి గుండె జబ్బులు వచ్చే ప్రమాదం కూడా ఎక్కువ అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఎక్కువ చక్కెర తినడం వల్ల శరీరంలో సోడియం పొటాషియం సహజ సమతుల్యత దెబ్బతింటుంది. ఇది హార్ట్ రిస్క్ ను మరింత పెంచుతుంది. తీపి పదార్థాలు పానీయాలు శరీరంలో కేలరీలను చాలా పెంచుతాయి. దీని కారణంగా పోషకాల లోపం మొదలవుతుంది. ఒక వ్యక్తి ప్రతిరోజూ స్వీట్లు తింటుంటే, అలాంటి వారు బరువు పెరుగుతారని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.బరువు పెరగడం అనేది ఒక వ్యాధి కాదు కానీ దాని కారణంగా అనేక ఇతర వ్యాధుల ప్రమాదం పెరుగుతుంది. గుండెపోటుకు అనేక కారణాలలో ఒకటి బరువు పెరగడం..హృద్రోగులు, స్వీట్ ఎక్కువగా తినడం ఆరోగ్యానికి మంచిది కాదని.. పేర్కొంటున్నారు. కావున సాధ్యమైనతంత వరకు తీపి పదార్థాలకు దూరంగా ఉండాలని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. మితంగా తింటే పర్వాలేదు కానీ.. ఎక్కువగా తింటే హాని తప్పదని హెచ్చరిస్తున్నారు.

## ప్రతిరోజూ ఈ నీళ్లను తాగితే.. అధిక బరువుకు బైబై చెప్పొచ్చు!



ప్రస్తుతం ఇప్పుడు ఎవర్ని కదిలించినా ఏదో ఒక అనారోగ్య సమస్య గురించి చెబుతూనే ఉంటున్నారు. ముఖ్యంగా చాలా మంది అధిక బరువుతో ఇబ్బంది పడుతున్నారు. గంటలు కూర్చుని పని చేయడం, ఆహారపు అలవాట్లు మారడం, లైఫ్ స్టైల్ చేంజ్ కావడం వల్ల.. బరువు పెరుగుతున్నారు. అధిక బరువు నుంచి విముక్తి పొందాలని చాలా రకాల ప్రయత్నాలు చేసే ఉంటారు. వాటితో పాటు ఈ చిట్కా కూడా పాటించి చూడండి. మంచి రిజల్ట్ కనిపిస్తుంది. శరీరంలో కొవ్వును కరిగించడానికి ఈ వస్తువు ఎంతో ఎఫెక్టివ్‌గా పని చేస్తుంది. దాల్చిన చెక్క గురించి ప్రత్యేకంగా పరిచయాలు అవసరం లేదు. దీని గురించి అందరికీ తెలుసు. దాల్చిన చెక్క నీటిని తాగడం వల్ల ఈజీగా వెయిట్ లాస్ అవ్వొచ్చు. వీటిల్లో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీంలోని మలినాలను బయటకు పంపుతాయి. దాల్చిన నీరు తాగడం వల్ల శరీరం మెటబోలిజం పెరుగుతుంది. దీంతో వెయిట్ లాస్ అయ్యేందుకు చక్కగా పని చేస్తుంది. ప్రతి రోజూ ఉదయం దాల్చిన చెక్క నీళ్లు తాగడం వల్ల బరువు తగ్గొచ్చు. మంచి డైట్, వ్యాయామంతో పాటు దాల్చిన చెక్క నీరు తాగితే.. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ త్వరగా కరుతుంది. ఫలితంగా స్థూలకాయం, అధిక బరువును తగ్గించుకోవచ్చు. ఈ వాటర్ తాగడం వల్ల ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా చాలా ఉన్నాయి.

## గర్భిణీ ఇలా చేస్తే శిశువుకు వైకల్యం తప్పదు..!



మాతృత్వం అనేది స్త్రీకి ఓ గొప్ప వరం. అదృష్టం ఉంటేనేగాని అమ్మ కాలేరు అంటారు పెద్దలు. నేటికీ ఎంతోమంది సంతానం లేక బాధపడుతున్నారు. కొందరు ఒక్క బిడ్డ పుడితే చాలని, తిరగని గుడి ఉండదు, కలవని డాక్టర్ ఉండరు. అయినా ఫలితం ఉండదు. కానీ బిడ్డలు లేక కొందరు బాధపడుతుంటే, మరికొందరు తలుపుతట్టిన అదృష్టాన్ని నిర్లక్ష్యంతో కాలరాసుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. స్త్రీ గర్భం దాల్చిన తరువాత చాల జాగ్రత్తగా ఉండాలి. శారీరకంగానే కాదు మానసికంగా కూడా ఆరోగ్యంగా ఉండాలి అని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా గర్భంతో ఉన్న స్త్రీలు ఎట్టిపరిస్థితిలోనూ ఒత్తిడికి గురికాకూడదని తాజాగా లండన్ లోని యూసీఎల్ వర్సిటీ పరిశోధకులు చేసిన పరిశోధనల్లో తేలింది. తల్లి ఒత్తిడికి గురైతే, ఆ ఒత్తిడి ప్రభావం గర్భసంచిపై పడుతుందని తెలిపింది. దీని కారణంగా గర్భసంచిలో అతి సున్నితంగా పెరుగుతున్న గర్భస్థ శిశువు రూపురేఖలు మారిపోతాయని, ఒత్తిడి మరీ ఎక్కువైతే శిశువుకు వైకల్యం కూడా వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు. కానీ బిడ్డలు లేక కొందరు బాధపడుతుంటే, మరికొందరు తలుపుతట్టిన అదృష్టాన్ని నిర్లక్ష్యంతో కాలరాసుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. స్త్రీ గర్భం దాల్చిన తరువాత చాల జాగ్రత్తగా ఉండాలి.

## పెరుగులో ఇవి కలిపి తింటే మలబద్దకం...!

ప్రస్తుత ఉరుకులపరుగుల జీవితంలో సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. అందులో మలబద్ధకం సమస్యను ఒకటి. ఆరోగ్యంగా ఉండాలంటే మన రోజువారి ఆహారపు అలవాట్లు మెరుగుపరచడంతో పాటు, పెరుగును ఆహారంలో చేర్చుకుంటే, మలబద్ధకం నుండి ఉపశమనం పొందడమే కాకుండా, అనేక ఇతర ప్రయోజనాలు కూడా పొందుతారు. ముఖ్యంగా వేసవి కాలంలో డైరీప్రొడక్ట్ డైలీ డైట్ లో తప్పనిసరిగా ఉండేట్లు చూసుకోవాలి. డైరీప్రొడక్ట్స్ లో ప్రోబయోటిక్స్ అధికంగా ఉండటం వల్ల శరీరంలో వ్యాధినిరోధకత పెంచుతుంది. అనారోగ్య సమస్యలు దూరం అవుతాయి. పెరుగులో ఉండే ప్రోలాక్టిన్ మరియు ప్రోబయోటిక్స్ ఉండటం వల్ల ఇవి కలిపి తింటే మలబద్ధకం నుండి ఉపశమనం లభిస్తుంది. మరెన్నో లాభాలు కూడా ఉన్నాయి. మలబద్ధకం నుండి విముక్తి పొందాలంటే, పెరుగుతో వీటిని తినండి. ఆరోగ్యంగా ఉండటానికి, రోజువారీ ఆహారంలో పెరుగును చేర్చుకోవడం మంచిది, అయితే మలబద్ధకం వంటి సమస్యలను వదిలించుకోవడానికి పెరుగు చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. క్యాల్షియం, ప్రొటీన్లు, ఫైబర్ మరియు అనేక ఇతర విటమిన్లు మరియు మినరల్స్ సమృద్ధిగా ఉన్న పెరుగును మీ ఆహారంలో చేర్చుకుంటే, మీరు మలబద్ధకం సమస్య నుండి ఉపశమనం పొందడమే కాకుండా అనేక ఇతర ప్రయోజనాలను పొందుతారు. మీ ఆహారంలో పెరుగును చేర్చుకోవడం వల్ల మీ ఎముకలను బలోపేతం చేయడమే కాకుండా మీ జీర్ణక్రియను ఆరోగ్యంగా ఉంచుతుంది మరియు ఇది మీ జుట్టు మరియు చర్మానికి కూడా మేలు చేస్తుంది. కాబట్టి మనం పెరుగుతో పాటు ఏయే ఆహారాలతో ఎక్కువ ప్రయోజనాలు పొందవచ్చో తెలుసుకుందాం. పెరుగు ప్రోబయోటిక్ మరియు మంచి మొత్తంలో ఫైబర్ కలిగి ఉంటుంది, అయితే దోసకాయలో మంచి మొత్తంలో నీరు ఉంటుంది. ఈ రెండు విషయాల కలయిక ప్రేగులలో పేరుకుపోయిన మలాన్ని బయటకు పంపడంలో సహాయపడుతుంది. దీని వల్ల మలబద్ధకం ఉన్నవారు చాలా ప్రయోజనం పొందుతారు. వేయించిన జీలకర్రను గ్రైండ్ చేసి పెరుగులో కలుపుకుని అందులో కొద్దిగా రాళ్ల ఉప్పు లేదా నల్ల ఉప్పు వేసి తింటే జీర్ణశక్తి మెరుగుపడి అజీర్ణం వంటి సమస్యల నుంచి బయటపడతారు. ఈ విధంగా, మీరు మీ ఆహారంలో



పెరుగును చేర్చుకుంటే, అది బరువు తగ్గడానికి కూడా సహాయపడుతుంది. అయితే దోసకాయలో మంచి మొత్తంలో నీరు ఉంటుంది. ఈ రెండు విషయాల కలయిక ప్రేగులలో పేరుకుపోయిన మలాన్ని బయటకు పంపడంలో సహాయపడుతుంది. దీని వల్ల మలబద్ధకం ఉన్నవారు చాలా ప్రయోజనం పొందుతారు.

## చింత చిగురులో అద్భుత పోషకాలు....!

చింత చిగురు.. తీపి, పులుపు, ఒగురు మిళతమై ఉండే అద్భుతమైన పోషకాలు కలిగిన ఆకు కూరగా దీనిని పేర్కొనవచ్చు. అయితే ఇది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండదు.సీజనల్ వైజ్‌గా లభిస్తుంది. సంవత్సరానికి రెండు లేదా మూడు సార్లు చింత చెట్లు పూత దశకు వస్తుంటాయి. ఈ దశకు ముందు పాత ఆకులు రాలిపోతూ.. కొత్త ఆకులు చిగురిస్తుంటాయి. వీటినే చింత చిగురుగా పేర్కొంటారు. పప్పులో, వంకాయల్లో, నాన్ వెజ్‌లో కలిపి వండుకుని తింటుంటారు. అయితే ఇందులో అనేక పోషకాలు ఉంటాయి కాబట్టి ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెప్తున్నారు. ముఖ్యంగా థైరాయిడ్ సమస్యను దూరం చేయడంలో చింత చిగురు అద్భుతంగా ఉపయోగపడుతుందట. చింత చిగురులో ఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండటంవల్ల చింత చిగురును తినేవారిలో చెడు కొలెస్ట్రాల్ తొలగిపోతుంది. ఒళ్లు, కీళ్ల నొప్పులు తగ్గుతాయి.



అంతేకాకుండా ఆస్కార్బిక్ యాసిడ్, విటమిన్ సి, టార్టారిక్ యాసిడ్స్ ఉండటం మూలంగా చింత చిగురును ఆహారంలో భాగంగా యూజ్ చేయడంవల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీంతోపాటు చింత చిగురును నీటిలో ఉడికించి, ఆ తర్వాత ఆ కషాయంతో పుక్కిలిస్తే పంటి, గొంతు నొప్పులు తగ్గుతాయి.

## ఐస్ క్రీమ్స్ తినాలనిపిస్తుందా... ఇది కూడా వ్యాధే.....!



కొంత మందికి చాక్లెట్స్, ఐస్ క్రీమ్స్ తినడం చాలా ఇష్టం. తప్పనిసరిగా డైలీ తింటూ ఉంటారు. అయితే వీటిని కొందరి ఉదయాన్నే తినాలనిపిస్తే, మరి కొందరికి మధ్యాహ్నం, రాత్రి సమయంలో తినాలనిపిస్తుంది.అయితే రాత్రి సమయంలో కొంతమందికి అతిగా స్వీట్స్, చాక్లెట్స్, ఐస్ క్రీమ్స్ తినాలనిపిస్తుందంట. ఇలా తినాలనిపించడం వెనుక కూడా ఓ ప్రత్యేకమైన కారణం ఉన్నదంటున్నారు నిపుణులు. ఒంటరి తనం వల్లనే నైట్ టైమ్‌లో చాక్లెట్స్, ఐస్ క్రీమ్స్ ఎక్కువగా తినాలని పిస్తుందంట. దీనికి కారణం ఒంటరితనమే అంటున్నారు నిపుణులు. లాస్ ఏంజిల్స్‌లోని కాలిఫోర్నియా యూనివర్సిటీవారు. ఒంటరిగా ఉన్న కొంతమందిని తీసుకొని పరిశోధన చేయగా,ఈ విషయం వెల్లడైందంట. ఒంటరిగా ఉండేవారిలో మాత్రం స్థూలకాయం, నిరాశ, ఆందోళన పెరుగుతున్నట్లు గుర్తించారు. ఇవి పెరగడానికి స్వీట్ క్రేవింగ్స్? కూడా ఓ ప్రధాన కారణమవుతుందని తెలిపారు. ఒంటరిగా ఉన్నప్పుడు స్వీట్స్? తినాలనే ఎక్కువగా అనిపిస్తుందని, దానివల్ల స్థూలకాయం, మధుమేహం, అతిగా తినడం వంటి సమస్యలు ఎక్కువ అవుతున్నాయని తెలిపారు. ఇది కూడా ఓ వ్యాధిలాంటిదే.. ఇది మానసిక, శారీరక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందంటున్నారు నిపుణులు. ఇలా తినాలనిపించడం వెనుక కూడా ఓ ప్రత్యేకమైన కారణం ఉన్నదంటున్నారు నిపుణులు. ఒంటరి తనం వల్లనే నైట్ టైమ్‌లో చాక్లెట్స్, ఐస్ క్రీమ్స్ ఎక్కువగా తినాలని పిస్తుందంట. దీనికి కారణం ఒంటరితనమే అంటున్నారు నిపుణులు.

## మల్టీవిటమిన్ సప్లిమెంట్స్ తీసుకుంటే జరిగేది ఇదే..!



నేటి కాలంలో మల్టీవిటమిన్స్ తీసుకునే ట్రెండ్ బాగా పెరిగింది. శరీరంలోని పోషకాల లోపాన్ని అధిగమించేందుకు అనేక మంది వీటిని తీసుకుంటున్నారు. దీంతో వివిధ బ్రాండ్ల మల్టీవిటమిన్‌లకు మార్కెట్‌లో ఫుల్ డిమాండ్ పెరిగింది.వీటిని ట్యాబ్లెట్లు, పౌడర్, ఎనర్జీ డ్రింక్స్ రూపంలో మార్కెట్లలో విక్రయిస్తున్నారు. వీటిని తీసుకోవడం వల్ల శరీరంలో విటమిన్లు, ప్రొటీన్లు, ఐరన్, కాల్షియం లోపం భర్తీ చేయవచ్చని భావిస్తుంటారు. కానీ మల్టీవిటమిన్ల గురించి జరుగుతోన్న ఈ ప్రచారం వల్ల చాలామంది వైద్యులను సంప్రదించకుండానే వాటిని తీసుకోవడం మొదలుపెడుతున్నారు. ఇలా నెలలు, సంవత్సరాల తరబడి వీటిని తీసుకుంటున్నారు. డైట్ సప్లిమెంట్ల మార్కెట్ రూ.43,650 కోట్లకు చేరుకుందని IMARC గ్రూప్ తాజా నివేదిక వెల్లడిస్తోంది. 2028 నాటికి అది రూ.95,810 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. దీనికి కారణం పట్టణ ప్రాంతాల్లో మల్టీవిటమిన్ సప్లిమెంట్ల డిమాండ్ వేగంగా పెరగడమే. ఢిల్లీలోని రాజీవ్ గాంధీ ఆసుపత్రికి చెందిన డాక్టర్ అజిత్ జైన్ మాట్లాడుతూ.. నేటి సోషల్ మీడియా, గూగుల్ కాలంలో ప్రతి ఒక్కరూ తమ వైద్యాం తామే చేసుకుంటున్నారు. శరీరంలో చిన్నపాటి సమస్య వచ్చిన వెంటనే గూగుల్‌లో వెతికి మందులు తెచ్చుకుని, వాడుతున్నారు. మల్టీవిటమిన్ల విషయంలో కూడా ఇదే జరుగుతుంది. టీవీల్లో ప్రకటనలు చూసి వాటిని తీసుకునే ట్రెండ్ పెరిగింది. కానీ ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. మల్టీవిటమిన్లు తీసుకోవడం ద్వారా సమతుల్య ఆహారం తీసుకోవడం జరగదు. ఫలితంగా మూత్రపిండాలు, కాలేయం దెబ్బతింటాయి. నిజానికి ప్రత్యేకంగా శరీరానికి మల్టీవిటమిన్స్ అవసరం లేదు. శరీరంలో ఏ విటమిన్ లోపిస్తే ఆ విటమిన్ మాత్రమే తీసుకోవాలి. ఉదాహరణకు శరీరంలో విటమిన్ D లేదా B12 లోపం ఉంటే, అది లభించే మెడిసిన్ మాత్రమే తీసుకోవాలి. అది కూడా వైద్యులను సంప్రదించిన తర్వాత మాత్రమే వాడాలి. ఎందుకంటే మల్టీవిటమిన్లలో విటమిన్ ఎ, ఇ కూడా ఉంటాయి. ఈ విటమిన్ల లోపం చాలా అరుదుగా కనిపిస్తుంది. కానీ అవసరం లేకపోయినా వాటిని అనేక మంది తీసుకుంటూ ఉంటారు. ఫలితంగా లేనిపోని సమస్యలు వచ్చిపడతాయి. విటమిన్ A అధిక మోతాదులో తీసుకుంటే వాంతులు, విరేచనాలకు కారణమవుతుంది.

# కొత్త రిలీజ్ డేట్ ఇదేనా?

ప్రభాస్ నాగ్ అశ్విన్ కాంబోలో రాబోతోన్న కల్కి 2898 ఏడీ మూవీ గురించి వచ్చే ప్రతీ అప్డేట్ ఎంతగా వైరల్ అవుతుంటుందో అందరికీ తెలిసిందే. ఈ మూవీలో దీపిక పదుకొణె, అమితాబ్, కమల్ హాసన్ వంటి వారంతా నటించారు. ఈ మూవీని ముందుగా మే 9న విడుదల చేయాలని భావించారు. కానీ ఎన్నికల సందర్భంగా ఈ చిత్రాన్ని వాయిదా వేయాలని అనుకుంటున్నారట. ప్రభాస్, దీపిక పదుకొణె, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ వంటి భారీ తారాగణంతో నాగ్ అశ్విన్ కల్కి 2898 ఏడీ సినిమాను నిన సంగతి తెలిసిందే. అశ్వనీదత్ భారీ



ఎత్తున ఈ చిత్రాన్ని నిర్మించాడు. తనకు లక్కీ డేట్‌గా ఉండే మే 9న ఈ మూవీని విడుదల చేయాలని అనుకున్నాడు. కానీ ఎన్ని కలు వచ్చి పడటంతో సినిమాను వాయిదా వేయాల్సి వచ్చింది. ఇంత వరకు సినిమాను వాయిదా వేయబోతోన్నామని మాత్రం అధికారికంగా ప్రకటించలేదు. కానీ తప్పకుండా పోస్ట్ పోన్ అవుతుందని మాత్రం అంతా అనుకుంటున్నా రు. మే 9న జగదేక వీరుడు అతిలోక సుందరి, మహానటి వంటి చిత్రాలను రిలీజ్ చేసి బ్లాక్ బస్టర్ హిట్లు కొట్టాడు. ఇక తమకు కలిసి వచ్చే ఆ డేట్‌నే కల్కి సినిమాకు ఎంచుకున్నారు. అయితే ఈ ప్రాజెక్ట్ కే సినిమాకు ఎన్నికలు అడ్డం వచ్చాయి. మే అంతా కూడా ఎన్నికల హడావిడే ఉంది. అందుకే ఈ సినిమాను వాయిదా వేయాలని అనుకుంటున్నారట. అయితే మరీ ఎక్కువ రోజులు వాయిదా వేయడం కూడా మంచిది కాదనే ఉద్దేశంలో యూనిట్ ఉందట. అందుకే మే 30న ఈ చిత్రాన్ని విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారట. ఈ మేరకు నెట్టింట్లో ఈ కొత్త రిలీజ్ డేట్ చక్కర్లు కొడుతోంది. మరి చిత్రయూనిట్ నుంచి అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి.

# కొత్త జోడీ దొరికింది!





తేజకు జోడీగా రితికా నటించబోతుందని సమాచారం అందుతోంది. ఈ మధ్య కాలంలో టాలీవుడ్‌లో ఈమెకు మంచి గుర్తింపు దక్కింది. టాలీవుడ్‌లో మొదటి సూపర్ హీరో కాన్సెప్ట్‌తో వచ్చిన హనుమాన్ సినిమాతో తేజ సజ్జా భారీ విజయాన్ని సొంతం చేసుకున్నాడు. సంక్రాంతి కానుకగా వచ్చిన హనుమాన్ టాలీవుడ్ ఇండస్ట్రీలో భారీ విజయాలు సాధించిన సినిమాల జాబితాలో చేరి పోయింది. హనుమాన్‌కి సీక్వెల్ కి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. ఆ గ్యాప్‌లో తేజ సజ్జా ఓ భారీ కమర్షియల్ ఎంటర్ టైనర్ ను చేసేందుకు సిద్ధం అయ్యాడు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందబోతున్న సినిమాలో తేజ సజ్జా హీరోగా నటించబోతున్న ట్లుగా ఇప్పటికే క్లారిటీ వచ్చింది. అదే సినిమాలో మరో హీరోగా మంచు మనోజ్ నటించబోతున్నాడు.

# అభిమాని కోసం సక్సెస్ మీట్‌కి 'దేవర'!



ఇప్పుడు ఎన్టీఆర్ తనపై ఇంతటి అభిమానం కనబరుస్తున్న సిద్దు జొన్నలగడ్డ కోసం సక్సెస్ మీట్ లో పాల్గొనెందుకు సిద్ధం అయ్యాడు. యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రస్తుతం దేవర సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్నాడు. త్వరలోనే దేవర సినిమా షూటింగ్‌ను ముగించి వార్ 2 సినిమా షూటింగ్‌కి జాయిన్ అవ్వాలని ఎన్టీఆర్ భావిస్తున్నాడు. ఇలాంటి సమయంలో కూడా తన అనుకున్న వారికి, తనను అభిమానించే వారికి కావాల్సినంత సమయంను ఎన్టీఆర్ ఇస్తూనే ఉంటారు. తాజాగా విశ్వక్ సేన్ మరియు సిద్దు జొన్నలగడ్డ ను కలిసిన విషయం తెల్సిందే. ఇద్దరికి కూడా ఎన్టీఆర్ అంటే చాలా అభిమానం. ఆ విషయాన్ని చాలా సందర్భాల్లో వారు చెప్పుకొచ్చారు. అలా తమ అభిమాన నటుడిని నిర్మాత నాగ వంశీతో కలిసి విశ్వక్ సేన్ మరియు సిద్దు లు కలిసి కొద్ది సమయం సరదాగా గడిపారు. ఫ్యాన్ బాయ్ మూమెంట్ అంటూ ఫోటోలు కూడా షేర్ చేసిన విషయం తెల్సిందే. ఇప్పుడు ఎన్టీఆర్ తనపై ఇంతటి అభిమానం కనబరుస్తున్న సిద్దు జొన్నలగడ్డ కోసం సక్సెస్ మీట్‌లో పాల్గొనెందుకు సిద్ధం అయ్యాడు. టిల్లు స్క్వేర్ సక్సెస్ మీట్ లో ఎన్టీఆర్ పాల్గొనబోతున్నా డు. సిద్దు జొన్నలగడ్డ హీరోగా అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా సితార ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్‌లో రూపొంది ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చిన టిల్లు స్క్వేర్ మూవీ భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. 8 రోజుల్లో దాదాపుగా వంద కోట్ల రూపాయల వసూళ్లు నమోదు చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం సినిమాకు భారీ సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకు న్నారు. ఆ సక్సెస్ మీట్‌కు ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరు అవ్వబోతున్నాడు. సిద్దు కు తనపై ఉన్న అభిమానం కోసం దేవర ఈ మీట్ కు వచ్చేందుకు ఓకే చెప్పి ఉంటాడు.



# ఇదొక సంచలనం

పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన ది గోట్ లైఫ్ మూవీ ఇప్పుడు మాలీవుడ్‌లో సంచలనంగా మారింది. తెలుగులోనూ ఈ మూవీకి మంచి ప్రశంసలు వచ్చాయి. కానీ ఇలాంటి సినిమాలు థియేటర్లు తెలుగు ఆడియెన్స్ అంతగా ఆదరించరన్న సంగతి తెలిసిందే. కానీ మాలీవుడ్‌లో మాత్రం ఈ మూవీ రికార్డులు క్రియేట్ చేస్తోంది. మలయాళంలో ప్రస్తుతం వరుసగా బ్లాక్ బస్టర్ హిట్లు వస్తున్నాయి. ప్రేమలు, మంజుమ్మల్ బాయ్స్ అల్రెడీ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచాయి. వంద, రెండు వందల కోట్ల క్లబ్బులో జాయిన్ అయ్యాయి. అలా ఇప్పుడు స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన "ది గోట్ లైఫ్" (ఆడు జీవితం) సినిమా కూడా రికార్డులు క్రియేట్ చేస్తోంది. ఈ మూవీ గత నెల 28న పాన్ ఇండియా స్థాయిలో మలయాళంతో పాటు హిందీ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో విడుదలైన సంగతి తెలిసిందే. తెలుగులో ఈ సినిమాను మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేయగా.. మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ మూవీకి తెలుగులో మంచి ప్రశంసలు దక్కాయి. అయితే ఇక్కడ మాత్రం కలెక్షన్లు చెప్పుకునే రేంజ్‌లో అయితే రావడం లేదు. కానీ "ది గోట్ లైఫ్" (ఆడు జీవితం) సినిమా 9 రోజుల్లో వరల్డ్ వైడ్ గా 100 కోట్లకు పైగా గ్రాస్ కలెక్ట్ చేసి రికార్డులు క్రియేట్ చేసింది. వరల్డ్ వైడ్ గా 1720 స్క్రీన్స్ లో "ది గోట్ లైఫ్" (ఆడు జీవితం) సినిమా రన్ అవుతోన్న సంగతి తెలిసిందే. మాలీవుడ్‌లో వంద కోట్లు కొల్లగొట్టడం అంటే ఇండస్ట్రీ హిట్లు అన్న మాటే. ఈ ఏడాది వరుసగా అక్కడి మేకర్లు హిట్ల మీద హిట్లు కొడుతున్నారు. పృథ్వీరాజ్ సినిమాలకు అక్కడ మంచి గిరాకీ ఉంటుంది. ఇక ఈ మూవీ ఇప్పుడు సక్సెస్ ఫుల్ గా ఫస్ట్ వీక్ కంప్లీట్ చేసుకుని రెండో వారంలోకి అడుగుపెట్టింది. రెండో వారంలోనూ బాక్సాఫీస్ వద్ద మంచి ఆదరణ పొందుతోంది. ఈ సినిమాను బెన్యామిన్ రాసిన గోట్ డేస్ నవల ఆధారంగా అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ బ్లెస్సీ రూపొందించిన విషయం విదితమే. విజువల్ రొమాన్స్ బ్యానర్ ఈ సినిమాను మలయాళ చిత్ర పరిశ్రమలో ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ గా భారీ బడ్జెట్ తో నిర్మించింది.



# అన్ని కోట్లు ఇస్తున్నారా?

అవును అక్షరాల 10 కోట్లకు పైగానే పారితోషికం తీసుకుంటుందిట. దక్షిణాది పారితోషికంతో పోల్చితే అక్కడ రెట్టింపు అందుకుంటుందని తెలుస్తోంది. నేచురల్ పెర్ఫార్మర్ సాయిపల్లవి ఎంతటి ప్రతిభావంతురాలన్నది చెప్పాల్సిన పనిలేదు. కటౌట్ కాకపోయినా తనలో ఉన్న కంటెంట్ తో రాణిస్తోన్న నటి ఆమె. అందుకే ఎంత మంది కొత్త భామలొచ్చినా ఆమెకి పోటీ కాదనే చెప్పాలి. నెంబవర్ వన్ రేసులో ఎంతమంది హీరోయిన్లు ఉన్నా! సాయి పల్లవికుంటూ ప్రత్యేకమైన ట్రాక్ వేసుకుని ముందు కెళ్తుంది. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటుంది. కేవలం డీసెంట్ పాత్రల మాత్రమే చేస్తుంది. అందులోనూ నటనకు ఆస్కారం ఉండాలి. ఇలా తనకంటూ కొన్ని నియమ నిబంధనలున్నాయి. ఆ ప్రకారం ముందుకెళ్తుంది. అందుకు తగ్గ అవకాశాలే అమ్మడు అందుకుంటుంది. ఇక్కడ ఆమె ఒక్కో సినిమాకి నాలుగు నుంచి ఐదు కోట్లు పారితోషికం అందుకుంటుంది. నిర్మాతల్ని అధికంగా డిమాండ చేస్తోందనిగానీ.... అదనపు భారాలు మోపుతుందని గానీ ఏ నాడు తెరపైకి వచ్చింది లేదు. ఎందుకంటే అమ్మడు ఇండస్ట్రీలో కొన్ని ఎథిక్స్ తో ముందుకెళ్తుంది. ఎంతో డౌన్ ఎర్త్ ఉంటుంది. తాను హీరోయిన్ అనే ఫీలని పక్కనబెట్టి అందరితో కలిసి పోయే మనస్తత్వం గలది. ఆ రకమైన లక్షణం కూడా పల్లవిని తెలుగు ఆడియన్స్ ని మరింత దగ్గర చేసింది. ప్రస్తుతం సాయి పల్లవి బాలీవుడ్ లో 'రామాయణ్'లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో సీత పాత్రలో నటిస్తోంది. మరి ఈ సినిమాకి అమ్మడు తీసుకునే పారితోషికం ఎంతో తెలిస్తే స్టన్ అవ్వడం ఖాయం. అవును అక్షరాల 10 కోట్లకు పైగానే పారితోషికం తీసుకుంటుందిట. దక్షిణాది పారితోషికంతో పోల్చితే అక్కడ రెట్టింపు అందుకుంటుందని తెలుస్తోంది. మరి డిమాండ్ చేయని హీరోయిన్‌కి అంత ఎందుకు ఇస్తారు? అంటే ఇక్కడ తన మార్కెట్‌ని బాలీవుడ్ పెంచినట్లు సమాచారం. ఇన్ని కోట్లు ఇవ్వండని సాయిపల్లవి అడగలేదుట. తన ప్రతిభని... ఫాలోయింగ్‌ని చూసి దర్శక-నిర్మాతలు ఆమాత్రం చేయాలని నిర్ణయించి ఇచ్చినట్లు ఇన్ సైడ్ టాక్ వినిపిస్తుంది.

# వైట్ అండ్ వైట్‌లో హాట్ బ్యూటీ!



తెలుగమ్మాయి శోభిత దూళిపాళ సక్సెస్ గురించి చెప్పాల్సిన పనిలేదు. బాలీవుడ్ టూ హాలీవుడ్ వయా టాలీవుడ్ మీదగా దూసుకెళ్లిన బ్యూటీ. తెలుగమ్మాయి శోభిత దూళిపాళ సక్సెస్ గురించి చెప్పాల్సిన పనిలేదు. బాలీవుడ్ టూ హాలీవుడ్ వయా టాలీవుడ్ మీదగా దూసుకెళ్లిన బ్యూటీ. ఓ తెలుగు నటి ఇంగ్లీష్ సినిమా చేయడం అన్నది నిజంగా ప్రశంసించదగ్గ విషయం. ఎంతో మంది తెలుగు భామలున్నా! ఎవరికీ సాధ్యం కానిది శోభిత సాధ్యం చేసి చూపించింది. సినిమా ఛాన్స్ అనేది ఇండియాలో ఎంత కష్టమో అందరికీ తెలిసిందే. సొంత భాషలో యాచిస్తేగానీ అవకాశాలు రావు. అలాంటిది ఏకంగా భాషకానీ భాషలో..దేశం కానీ దేశంలో వరల్డ్ లోనే ఫేమస్ అయ్యే హాలీవుడ్‌లో అవకాశం అందుకుని షెభాష్ అనిపించింది శోభిత. ఆమె హాలీవుడ్‌లో మంకీ మ్యాన్ అనే సినిమాలో నటించిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 5న ఆ చిత్రం రిలీజ్ అయింది. ఫ్యాన్స్‌కు అనసూయ సూపర్ ట్రీట్ ఇక బ్యూటీ సినిమా ప్రమోషన్ కోసం రకరకాల కార్యక్రమాల్లో పాల్గొంది. తాజాగా అలాంటి ఈవెంట్ కి సంబంధించిన ఫోటో ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. లాస్ ఏంజిల్స్‌లోని చారిత్రాత్మక చైనీస్ థియేటర్‌లో మంకీ మ్యాన్‌రెడ్ కార్పెట్‌పై హొయలు పోయేందుకు అమ్మడు ఇలా ముస్తాబైంది. వైట్ కలర్ డిజైనర్ దుస్తుల్లో అమ్మడు చెమల పిల్లి బ్యూటీని తలపిస్తుంది. వైట్ అండ్ వైట్‌లో శోభిత అందంగా కనిపిస్తుంది. అమ్మడి హెయిర్ స్టైల్..మ్యాకప్....చెవులీలు ప్రతీది ప్రత్యేకంగా ఫోకస్ చేసాయి.

# ఉపాసన బాటలో...



రకుల్ ప్రీత్ ప్రస్తుతం తెలుగులో అంతగా కనిపించడం లేదు. టాలీవుడ్‌లో రకుల్‌కు ఎక్కువగా ఆఫర్లు కూడా రావడం లేదు. ఆమె ఎక్కువగా బాలీవుడ్ మీద ఫోకస్ పెట్టేసింది. అక్కడ అజయ్ దేవగణ్‌తో వరుసగా సినిమాలు చేస్తూ వచ్చింది. రకుల్ ఈ మధ్యే తన ప్రియుడు జాకీ భగ్నానీని పెళ్లి చేసుకుంది. ఇప్పుడు రకుల్ పర్సనల్ లైఫ్‌ను బాగానే ఎంజాయ్ చేస్తోంది. రకుల్ ఎక్కువగా సినిమాలు చేయడం లేదనిపిస్తోం ది. సినిమాలున్నా లేకపోయినా రకుల్ మాత్రం వ్యాయామం, యోగా, వర్కౌట్లను మాత్రం కంపల్స రీగా చేస్తుంటుంది. రకుల్ ఫిట్ నెస్, స్ట్రిక్ట్ డైట్ గురించి మంచు లక్ష్మీ చెప్పిన వీడియోలు ఆ మధ్య బాగానే వైరల్ అయ్యాయి. రకుల్ ఫుడ్ విషయంలో ఎంతో సెలెక్టివ్‌గా ఉంటుందట. ఇప్పుడు రకుల్ ఫుడ్ సీక్రెట్స్ అన్నీ కూడా అభిమానులకు తెలియబోతోన్నాయి. ఉపాసన మాధిరి రకుల్ కూడా ఫుడ్ బిజినెస్, ఫుడ్ కుకింగ్ వీడియోలను చేయబోతోన్న ట్లుగా తెలుస్తోంది. ఈ వేసవి నుంచి అందరికీ ఉపశమనం కలిగించేలా ఏవైనా చిట్కాలు చెబుతుందా? ఆమె ఆహారపు అలవాట్ల గురించి చెబుతుం దా? ఆమె తీసుకునే డైట్‌కు తగ్గ ఫుడ్‌ను అందరికీ నేర్పిస్తుందా? అన్నది చూడాలి. ఉగాది నుంచి మాత్రం షురూ చేస్తున్నట్లుగా చెప్పేసింది. టేస్ట్ ప్లస్ హెల్త్ అంటూ వదిలిన ఈ వీడియో ఇప్పుడు నెట్టింట్లో వైరల్ అవుతోంది. అత్తమ్మ కిచెన్ అంటూ ఉపాసన ఫుడ్ బిజినెస్ ప్రారంభించేసింది. మరి రకుల్ కూడా అలాంటిది ఏమైనా చేస్తుందా? అన్నది చూడాలి. రకుల్ చివరగా అయలాన్ అంటూ శివ కార్తికేయన్‌తో సందడి చేసింది. ఆ మూవీ కోలీవుడ్‌లో ఓ మోస్తరుగా ఆడింది. తెలుగులో ఈ మూవీ రిలీజ్‌కు పలు అడ్డంకులు ఏర్పడ్డాయి. ఓటీటీలోనూ ఇంకా అందుబాటులోకి ఈ చిత్రం రాలేదన్న సంగతి తెలిసిందే.

# ఇస్రో కోసం ఇంటర్‌ట్యాంక్ స్ట్రక్చర్.....

హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఎస్‌ఈసీ ఇండస్ట్రీస్ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఇస్రో (భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ) వినియోగించే జీఎస్ఎల్‌వీ మార్క్-3 లాంచ్ వెహికల్ కోసం ఇంటర్‌ట్యాంక్ స్ట్రక్చర్ (ఐటీఎస్)ను ఎస్‌ఈసీ ఇండస్ట్రీస్ రూపొందించింది. విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ) డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉన్నికృష్ణన్‌కు దీన్ని మంగళవారం సాయంత్రం 'వర్చువల్' పద్ధతిలో ఎస్‌ఈసీ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ డి.విద్యాసాగర్ అందజేశారు. ఐటీఎస్‌ను ఇస్రో ప్రమాణాల ప్రకారం రూపొందించి, అందజేసిన తొలి ప్రైవేటు రంగ సంస్థ, ఎస్‌ఈసీ ఇండస్ట్రీస్ కావడం ప్రత్యేకత. దీన్ని హైదరాబాద్ బాలానగర్‌లో ఉన్న ఎస్‌ఈసీ ఇండస్ట్రీస్‌కు చెందిన యూనిట్లో, ఇస్రో ఇంజినీర్ల పర్యవేక్షణలో ఉత్పత్తి చేసి అసెంబుల్ చేశారు. 'గగన్‌యాన్' ప్రయోగానికి, 4 టన్నుల తరగతికి చెందిన జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీఓ) ఉపగ్రహ ప్రయోగాలకు జీఎస్ఎల్ మార్క్-3 లాంచ్ వెహికల్‌ను ఇస్రో వినియోగిస్తోంది. అందువల్ల లాంచ్ వెహికల్ పే-లోడ్ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఐటీఎస్ ఐసోగ్రిడ్ వెర్షన్ ను ఎస్‌ఈసీ ఇండస్ట్రీస్ రూపొందించింది. ఇస్రో భవిష్యత్తులో నిర్వహించే ప్రయోగాలకు దీన్ని ఫ్యాబ్రికేట్ చేసి, సరఫరా చేసే అవకాశాన్నీ సొంతం చేసుకుంది. ఈ సంస్థ ఎన్నో ఏళ్లుగా ఇస్రోకు లాంచ్ వెహికల్/ రాకెట్ సిస్టమ్స్‌ను సరఫరా చేస్తోంది. చంద్రయాన్, గగన్‌యాన్, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ ప్రయోగాల్లో భాగస్వామిగా ఉంది. లాంచ్ వెహికల్ ఎల్ 110 నుంచి సి 25 స్టేజ్ మధ్యలో ఇంటర్‌ఫేస్‌గా ఐటీఎస్ కీలక పాత్ర పోషిస్తుంది. ఐటీఎస్‌ను ఇస్రో ప్రమాణాల ప్రకారం రూపొందించి, అందజేసిన తొలి ప్రైవేటు రంగ సంస్థ, ఎస్‌ఈసీ ఇండస్ట్రీస్ కావడం ప్రత్యేకత. దీన్ని హైదరాబాద్ బాలానగర్‌లో ఉన్న ఎస్‌ఈసీ ఇండస్ట్రీస్‌కు చెందిన యూనిట్లో, ఇస్రో ఇంజినీర్ల పర్యవేక్షణలో ఉత్పత్తి చేసి అసెంబుల్ చేశారు.



# వ్యవసాయ ఎగుమతుల్లో 9% పతనం



**న్యూఢిల్లీ :** భారత వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్లో పతనం చోటు చేసుకుంది. గడిచిన ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి సమయంలో వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు 8.8 శాతం క్షీణించి 43.7 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఎర్ర సముద్ర సంక్షోభం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం పరిణామాలకు తోడు బియ్యం, గోధుమలు, పంచదార వంటి కీలక వస్తువుల ఎగుమతులపై విధించిన పరిమితుల వల్ల పతనం చోటు చేసుకుంది. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ గణంకాల ప్రకారం.. 202223 ఇదే 11 మాసాల్లో 47.9 బిలియన్ డాలర్ల వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు జరిగాయి.భారత వ్యవసాయ స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)లోనూ భారీ తగ్గుదల చోటు చేసుకుంది. 2022-23లో 4.7 శాతం వృద్ధిని సాధించగా.. 2023-24లో కేవలం 0.7 శాతం పెరుగుదలను నమోదు చేసింది.అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎపిఇడిఎ) జాబితాలోని 24 ప్రధాన వస్తువులలో 17 ఉత్పత్తులు సానుకూల వృద్ధిని నమోదు చేశాయి. తాజా పండ్లు, గేదె మాంసం, ప్రాసెస్ చేసిన కూరగాయలు, బాస్మతి బియ్యం, అరటిపండ్లు ఎగుమతుల్లో వృద్ధి చోటు చేసుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో బియ్యం, గోధుమలు, చక్కెర, ఉల్లి వంటి వస్తువులపై ఆంక్షలతో సుమారు 5-6 బిలియన్ డాలర్ల వ్యవసాయ ఎగుమతులను దెబ్బతీశాయని ఒక అధికారి తెలిపారు. 2022-23 ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి కాలంలో 4.2 బిలియన్ డాలర్ల బాస్మతీ బియ్యం ఎగుమతయ్యాయి. 2023-24 ఇదే సమయంలో 22 శాతం వృద్ధితో 5.2 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగాయి. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం ఎగుమతులపై ఎటువంటి ప్రభావం చూపలేదని ఓ అధికారి తెలిపారు.

# వాట్సాప్‌లో మరో సరికొత్త ఫీచర్..

## ఇంటర్‌నెట్ లేకుండానే హెచ్‌డీ ఫొటోలు, ఫైల్ పంపొచ్చు..!




ప్రముఖ ఇన్‌స్టంట్ మెసేజింగ్ కంపెనీ వాట్సాప్ యూజర్లకు శుభవార్త చెప్పింది. యూజర్ల ఎప్పటికప్పుడు సరికొత్త ఫీచర్స్‌ను పరిచయం చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా మరో ఫీచర్‌ను తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నది. ప్రముఖ ఇన్‌స్టంట్ మెసేజింగ్ కంపెనీ వాట్సాప్ యూజర్లకు శుభవార్త చెప్పింది. యూజర్ల ఎప్పటికప్పుడు సరికొత్త ఫీచర్స్‌ను పరిచయం చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా మరో ఫీచర్‌ను తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నది. ఫీచర్ అందుబాటులోకి వస్తే ఫొటోలు, వీడియోలు, మీడియా తదితర ఫైల్స్ అన్నీ ఆఫ్‌లైన్‌లోనూ షేర్ చేసుకునే వెసులుబాటు కలుగనున్నది. ఈ ఫీచర్‌కు సంబంధించిన అప్‌డేట్‌ను వాట్సాప్ ఫీచర్స్‌ను ట్రాక్ చేసే వాబీటాఇన్ఫో తెలిపింది. మొబైల్‌లో ఇంటర్‌నెట్ సదుపాయం లేకుండా పంపే ఫైల్స్ సైతం ఎన్‌క్రిప్ట్ చేయబడుతాయని.. తద్వారా సెక్యూరిటీ ఉంటుందని నివేదిక పేర్కొంది. కొత్త ఫీచర్‌కు సంబంధించిన స్క్రీన్‌షాట్‌ని సైతం రివీల్ చేసింది. ప్రస్తుతం ఈ ఫీచర్ బీటా టెస్టర్లకు అందుబాటులో ఉంది. విజయవంతమైతే త్వరలోనే అందరికీ అందుబాటులోకి రానున్నది. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం ఇంటర్‌నెట్‌ను వినియోగించకుండా ఫైల్స్‌ను షేర్ చేసేందుకు బ్లూటూత్, షేర్ఇట్, నియర్‌బై షేర్ అప్లికేషన్స్‌తో ఫైల్స్‌ను షేర్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇదే తరహాలోనే మెటా యాజమాన్యంలోని వాట్సాప్ ఈ యాప్‌ను తీసుకురాబోతున్నది. ఈ ఫీచర్ ఎనేబల్ చేసుకోవాలంటే వాట్సాప్ సిస్టమ్ ఫైల్, ఫొటోల గ్యాలరీ యాక్సెస్ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. మరో వైపు వాట్సాప్ తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సదుపాయాన్ని పరిచయం చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వాట్సాప్ మరో కొత్త ఫీచర్‌పై సైతం పని చేస్తున్నది. చాట్‌లిస్ట్‌లో ఫేవరెట్స్ ఆప్షన్‌ను తీసుకురాబోతున్నది. ఇందులో యూజర్లకు తమకు ఇష్టమైన వ్యక్తులను అందులో యాడ్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. దాంతో తరచూ చాట్‌చేసే వారితో పాటు కాంటాక్ట్స్ మొత్తం వెతుక్కోవాల్సిన అవసరం ఉండదు. ఫీచర్ అందుబాటులోకి వస్తే ఫొటోలు, వీడియోలు, మీడియా తదితర ఫైల్స్ అన్నీ ఆఫ్‌లైన్‌లోనూ షేర్ చేసుకునే వెసులుబాటు కలుగనున్నది. ఈ ఫీచర్‌కు సంబంధించిన అప్‌డేట్‌ను వాట్సాప్ ఫీచర్స్‌ను ట్రాక్ చేసే వాబీటాఇన్ఫో తెలిపింది. మొబైల్‌లో ఇంటర్‌నెట్ సదుపాయం లేకుండా పంపే ఫైల్స్ సైతం ఎన్‌క్రిప్ట్ చేయబడుతాయని.. తద్వారా సెక్యూరిటీ ఉంటుందని నివేదిక పేర్కొంది.

# టాప్ ఈవీ తయారీ సంస్థ క్యూ 1 ఫలితాలు ఎలా ఉన్నాయంటే..



అమెరికాలోని టాప్ ఈవీ తయారీ కంపెనీగా పేరున్న టెస్లా ఇటీవల విడుదల చేసిన మొదటి త్రైమాసిక ఫలితాల్లో ఇన్వెస్టర్లకు షాకిచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా వినియోగదారులకు ఇచ్చిన హామీ మేరకు 3,87,000 యూనిట్లను డెలివరీ చేసినట్లు కంపెనీ తెలిపింది. అయితే క్యూ1 ఫలితాల్లో టెస్లా అమ్మకాలు అంతకు ముందు త్రైమాసికంతో పోలిస్తే 8.5 శాతం తగ్గాయి.

దాంతో కంపెనీ రెవెన్యూ భారీగా తగ్గిపోయింది. ఏడేళ్లలో కంపెనీ ఇంతలా నష్టపోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. రెవెన్యూ తగ్గడంతో ఇటీవల కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 10శాతం మందిని కొలువుల నుంచి తొలగించినట్లు టెస్లా ప్రకటించింది. అంటే సుమారు 14వేల మందికి ఉద్వాసన పలుకుతున్నట్లు కంపెనీ ప్రతినిధులు చెప్పారు. చైనా ఈవీ తయారీ సంస్థల నుంచి టెస్లాకు భారీ పోటీ నెలకొన్నట్లు తెలిసింది. చైనాతోపాటు అంతర్జాతీయంగా దిగ్గజ సంస్థలు ఈవీలను తయారుచేస్తున్నాయి. టెస్లాలో వాడుతున్న ఫీచర్లతోపాటు అదనంగా మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాయి. దాంతో వినియోగదారులు ఇతర కంపెనీ ఉత్పత్తులు కొనేందుకు మొగ్గ చూపుతున్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్ ఈ నెలలో భారత్‌లో పర్యటించనున్నారనే వార్తలు ఇటీవల వైరల్‌గా మారాయి. ఈమేరకు వీటిని ధ్రువీకరిస్తూ మస్క్ కూడా ట్విటర్ వేదికగా స్పందించారు. అయితే ఆ పర్యటనను వాయిదావేశారు. ఏప్రిల్ 23న అమెరికాలో టెస్లా ఇన్వెస్టర్ల సమావేశం ఉండడంతో ఈ పర్యటన వాయిదా పడిందని కొన్ని మీడియా సంస్థల్లో కథనాలు వచ్చాయి. మస్క్ భారత్‌లో రూ.16 వేలకోట్లు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

# చిన్న పరిశ్రమలకు మరిన్ని లోన్లు....



**న్యూఢిల్లీ :** సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలలో (ఎంఎస్?ఎంఈ) ఈక్విటీ పెట్టుబడులను పెంచడానికి కేంద్రం ప్రయత్నాలను ప్రారంభించింది. ముఖ్యంగా వీటికి అసంఘటిత రంగంలో ఫైనాన్సింగ్ అవకాశాలను పెంచడానికి మార్గాలను వెతుకుతోంది. ఢిల్లీలో సోమవారం జరిగిన సమావేశంలో కేంద్ర ఎంఎస్?ఎంఈల మంత్రిత్వ శాఖ, ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఆర్థిక సేవల విభాగం ఎంఎస్?ఎంఈలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పరిశ్రమల సంస్థలు ఈ అంశాలపై చర్చించాయి. రాబోయే కొద్ది రోజుల్లో సిఫార్సులు సూచనలతో ముందుకు రావాలని పరిశ్రమ వాటాదారులను కోరారు. ఎస్ఆర్ఐ ఫండ్ (సెల్ఫ్ రిలయంట్ ఇండియా) ద్వారా ఎంఎస్ఎంఈల ఈక్విటీ ఫైనాన్సింగ్‌ను మరింతగా పెంచడం, అసంఘటిత రంగాలలో వ్యాపారాలకు ఫైనాన్సింగ్‌ను పెంచడంపై సమావేశంలో చర్చించామని అధికారులు చెప్పారు. ఎస్ఆర్ఐ ఫండ్ 2020లో రూ.50 వేల కోట్ల కార్పస్‌తో ప్రారంభమయింది. అందులో రూ.10,006 కోట్లు కేంద్రం నుంచి, మిగిలినవి ప్రైవేట్ క్యాపిటల్ లేదా వెంచర్ క్యాపిటల్ ఫండ్స్ నుంచి వస్తాయి. గత మూడేళ్ళలో 425 ఎంఎస్?ఎంఈలకు సుమారు రూ.7,593 కోట్ల పెట్టుబడులు వచ్చాయని ఎంఎస్?ఎంఈల మంత్రిత్వ శాఖ గత నెలలో ట్వీట్ చేసింది. అదనంగా, 51 డాటర్ ఫండ్స్‌ను ఎన్ఎస్ఐసీ వెంచర్ క్యాపిటల్ ఫండ్స్ కింద ఎంపిక చేశారు. ఢిల్లీలో సోమవారం జరిగిన సమావేశంలో కేంద్ర ఎంఎస్?ఎంఈల మంత్రిత్వ శాఖ, ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఆర్థిక సేవల విభాగం ఎంఎస్?ఎంఈలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పరిశ్రమల సంస్థలు ఈ అంశాలపై చర్చించాయి. రాబోయే కొద్ది రోజుల్లో సిఫార్సులు సూచనలతో ముందుకు రావాలని పరిశ్రమ వాటాదారులను కోరారు.

## విదేశీ టూర్ వెళ్తున్నారా?

# ఇది మీ వెంటే ఉండాల్సిందే.....




విదేశీ ప్రయాణం అంత సులభం కాదు. దాని చాలా ప్లానింగ్ కావాలి. ముఖ్యంగా మొదటిసారి వెళ్లే వారు మరింత జాగ్రత్తగా అన్ని సమకూర్చుకోవాలి. టికెట్లను బుక్ చేయడం దగ్గర నుంచి ఆ దేశంలోని పర్యటించేందుకు అవసరమైన ఏర్పాట్లు, హొటల్, రెస్టారెంట్లు, షాపింగ్ చేసేందుకు అనువైన షెడ్యూల్ ను రూపొందించుకోవాలి. దీనికి సరైన ప్రణాళిక అవసరం. అదే సమయంలో మీ డబ్బును ఏ విధంగా ఖర్చుచేస్తారు అనేది కూడా ముఖ్యమైన అంశం. ఎందుకంటే విదేశాల్లో ట్యాక్స్ కలెక్టెడ్ ఎట్ సోర్స్(టీసీఎస్) కట్ అవుతుంది. అందుకే అక్కడ క్రెడిట్ కార్డు గానీ లేదా ఫారెక్స్ కార్డును వినియోగించడం మేలు. ఈ నేపథ్యంలో క్రెడిట్ కార్డు, ఫారెక్స్ కార్డు అంటే ఏమిటి? వాటి ప్రయోజనాలు ఎలా ఉంటాయి? తెలుసుకుందాం రండి. క్రెడిట్ కార్డులు.. క్రెడిట్ కార్డ్ ద్వారా బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థ నుంచి డబ్బును నేరుగా వినియోగించుకోవచ్చు. వీటి ద్వారా మీరు చేసిన కొనుగళ్లకు సంబంధించిన డబ్బును బిల్ జనరేట్ అయిన తర్వాత నిర్ణీత సమయంలోపు తిరిగే చెల్లించే వీలుంటుంది. ఈ కొనుగోళ్లను ప్రోత్సహించేందుకు క్రెడిట్ కార్డ్ కంపెనీలు ప్రోత్సాహక కార్యక్రమాలు, రాయితీలు, ఇతర ప్రోత్సాహకాలను కూడా అందిస్తాయి. ఫారెక్స్ కార్డులు.. ఫారెక్స్ కార్డ్ అనేది ఒక రకమైన ప్రీపెయిడ్ ట్రావెల్ కార్డ్. ఇది విదేశీ డబ్బును లోడ్ చేయడానికి, ఖర్చు చేయడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది. కార్డ్ బ్యాంకులు జారీ చేస్తాయి. మీరు ఎంచుకున్న కరెన్సీతో ముందుగానే లోడ్ చేయవచ్చు, మీరు సందర్శించే విదేశీ దేశంలో నగదు ఉపసంహరణలు, షాపింగ్, భోజనం చేయడానికి దాన్ని ఉపయోగించవచ్చు.

# 1 లీటర్ పాల ధర రూ.5000..

## నెలకు లక్షల్లో ఆదాయం



ఎవరైన పని చేయకుంటే వారిని గాడితో పోలుస్తుంటారు. ఏ పని చేయకుండా గాడిదలాగా తిరుగున్నాడంటూ తిట్టిపోస్తుంటారు. అయితే ఈ గాడిద మన జీవితంలో ఎంత ముఖ్యమైనదో తెలుసా? సుదూర ప్రాంతాలకు బరువైన వస్తువులను తీసుకెళ్లేందుకు గాడిదలను ఉపయోగిస్తుంటారు. అదే విధంగా గాడిద పాలతో నెలకు లక్షల్లో సంపాదించవచ్చని మీకు తెలుసా? గాడిద పాల ధర ఆవు పాల ధర కంటే 70 రెట్లు ఎక్కువ. ఎవరైన పని చేయకుంటే వారిని గాడితో పోలుస్తుంటారు. ఏ పని చేయకుండా గాడిదలాగా తిరుగున్నాడంటూ తిట్టిపోస్తుంటారు. అయితే ఈ గాడిద మన జీవితంలో ఎంత ముఖ్యమైనదో తెలుసా? సుదూర ప్రాంతాలకు బరువైన వస్తువులను తీసుకెళ్లేందుకు గాడిదలను ఉపయోగిస్తుంటారు. అదే విధంగా గాడిద పాలతో నెలకు లక్షల్లో సంపాదించవచ్చని మీకు తెలుసా? గాడిద పాల ధర ఆవు పాల ధర కంటే 70 రెట్లు ఎక్కువ. ఓ పాల వ్యాపారి ఈ వ్యాపారం చేస్తూ ధనవంతుడయ్యాడు. గుజరాత్‌కు చెందిన ధీరేన్ సోలంకి అనే వ్యాపారవేత్త గాడిద ఫారమ్‌ను ప్రారంభించి మొత్తం 42 గాడిదలను పెంచుతున్నారు. ఈ గాడిద పాలను అమ్మడం ద్వారా ప్రతి నెలా 2 నుంచి 3 లక్షల రూపాయలు సంపాదిస్తున్నాడు.

# కాంగ్రెస్‌ను ఇరకాటంలో పడేసిన పిట్రోడా



న్యూఢిల్లీ : ఇండియన్ ఓవర్‌సీస్ కాంగ్రెస్ (ఐఒసి) చైర్‌పర్సన్ శామ్ పిట్రోడా ఒక వ్యాఖ్యతో కాంగ్రెస్ పార్టీని ఇరకాటంలో పడేశారు. కాంగ్రెస్ 'సంపద పునఃపంపిణీ' ఎన్నికల వాగ్దానంపై రాజకీయ వివాదం నెలకొన్న నేపథ్యంలో శామ్ పిట్రోడా భారత్‌లో యుఎస తరహా 'వారసత్వ పన్ను' విధానం ప్రవేశపెట్టాలని సూచించారు. పిట్రోడా వ్యాఖ్యలతో తనకు సంబంధం కాంగ్రెస్ స్పష్టం చేయగా భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఆక్షేపించింది. 'పిట్రోడా 'ఎఎన్‌ఐ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానాన్ని సమర్థించారు. సంపద పునఃపంపిణీ విధానం ప్రజల ప్రయోజనం కోసమే అని, అత్యంత సంపన్నుల ప్రయోజనార్థం కాదని ఆయన అన్నారు. అమెరికాలోని కొన్ని రాష్ట్రాల్లో అమలులో ఉన్న వారసత్వ పన్ను విధానం గురించచి పిట్రోడా వివరిస్తూ, 'ఒకరికి 100 మిలియన్ డాలర్లు విలువ చేసే సంపద ఉన్నట్లయితే అతను మరణించినప్పుడు సుమారు 45 శాతాన్ని తన పిల్లలకు బదలీ చేయగలడు. తక్కిన 55 శాతం ప్రభుత్వం పరం అవుతుంది. అది ఆసక్తికరమైన ఒక చట్టం. దాని ప్రకారం, మీ తరంలో మీరు సంపద కూడబెట్టినట్లయితే, మీరు నిష్క్రమించిన పక్షంలో మొత్తంగా కాకుండా అందులో సగాన్ని ప్రజల కోసం వదలివేయాలి. అది నాకు న్యాయంగానే కనిపిస్తోంది' అని చెప్పారు. 'భారత్‌లో అలా ఉండదు. ఎవరి ఆస్తి అయినా 10 బిలియన్‌లు అయినట్లయితే, అతను మరణించినప్పుడు అతని పిల్లలకు ఆ 10 బిలియన్లు అందుతాయి. ప్రజలకు ఏమీ లభించదు%ఽ% కనుక జనం చర్చించవలసిన తరహా అంశాలు ఇవి' అని పిట్రోడా అన్నారు. 'బుజ్జగింపు రాజకీయాలు'గా కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానాన్ని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొనడాన్ని పిట్రోడా ఆక్షేపిస్తూ, 'అలా ఆలోచించడం అమాయకత్వం & ఆయన మెదడు గురించి నాకు కొన్ని ఆందోళనలు ఉన్నాయి' అని చెప్పారు. సంపద పంపిణీ 'విధానపరమైన అంశం' అని పిట్రోడా అంటూ, భారత్‌లో 'కనీస వేతన విధానం' ఉండడం అవసరమని నొక్కిచెప్పారు. 'వారసత్వ పన్ను' గురించి పిట్రోడా వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని కాంగ్రెస్ స్పష్టం చేసింది. వాటిని సంచలనాత్మకం చేయడం ప్రధాని మోడీ 'దురుద్దేశపూర్వక' ఎన్నికల ప్రచారం నుంచి దృష్టి మళ్లించే యత్నమే అని పార్టీ విమర్శించింది. పిట్రోడా ఒక మెంటార్, మిత్రుడు, ఫిలాసఫర్, ప్రపంచవ్యాప్తంగా ఎందరికో మార్గదర్శకుడు అని, ఆయన భారత అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ పేర్కొన్నారు. 'తాను తీవ్రంగా భావించిన అంశాలపై పిట్రోడా స్వేచ్ఛగా తన అభిప్రాయాలు వ్యక్తం చేస్తుంటారు. ప్రజాస్వామ్యంలో ఒక వ్యక్తికి తన వ్యక్తిగత అంశాలను చర్చించే, వ్యక్తపరిచే స్వేచ్ఛ ఉంటుంది' అని రమేష్ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'పిట్రోడా అభిప్రాయాలు సదా భారత జాతీయ కాంగ్రెస్ వైఖరిని ప్రతిబింబిస్తుంటాయని దీనికి అర్థం కాదు. చాలా సార్లు అలా జరగదు. ఆయన వ్యాఖ్యలను సంచలనాత్మకం చేయడం, అసందర్భంగా విమర్శించడం నరేంద్ర మోడీ తప్పుడు ఎన్నికల ప్రచారంపై నుంచి దృష్టిని మళ్లించే ప్రయత్నమే' అని రమేష్ అన్నారు. తన వ్యాఖ్యలు వివాదం సృష్టించడంతో 'ఒక వ్యక్తిగా నేను యుఎస్‌లోని వారసత్వపన్ను గురించి అన్న మాటలను కాంగ్రెస్ మేనిఫెస్టోపై పిఎం వ్యాప్తి చేస్తున్న అబద్ధాల నుంచి దృష్టి మళ్లించేందుకు గోడీ మీడియా వక్రీకరించడం దురదృష్టకరం. కాంగ్రెస్‌తో సహా ఏ పార్టీ విధానానికీ దీనితో సంబంధం లేదు' అని పిట్రోడా 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు.

# నేను రాజీనామాతో వస్తా.. రేవంత్‌కు దమ్ముంటే రావాలి: హరీష్ రావు




మెదక్: ఆగష్టు 15 లోపు రైతు రుణమాఫీ, ఆరు హామీలు అమలు చేయడం నిజం అయితే అమరవీరుల స్థూపం వద్దకు సిఎం రేవంత్ రెడ్డి రావాలని మాజీ మంత్రి, ఎంఎల్ఏ హరీష్ రావు సవాల్ విసిరారు. అమరవీల స్థూపం వద్దకు రాజీనామా పత్రంతో తాను వస్తానని, రేవంత్ రెడ్డికి దమ్ముంటే రావాలన్నారు. మెదక్ రోడ్ షో లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు సంచలన కామెంట్స్ చేశారు. 'రాజీనామా లేఖలను ఇద్దరం కలిసి మేధావులు చేతిలో పెడదాం. సిఎం రేవంత్ రెడ్డి చెప్పినవి అమలు చేస్తే తన రాజీనామా లేఖను ఆ మేధావులు స్పీకర్ కు ఇస్తారు. చేయకుంటే రేవంత్ రాజీనామా లేఖను గవర్నర్ కు ఇస్తారు. రాజీనామాకు సిద్ధమేనా అని అడుగుతున్నానని సవాల్ విసిరారు. గతంలో కొడంగల్ లో రాజకీయ సన్యాసం తీసుకుంటా అని రేవంత్ తోక ముడిచాడని, ఇప్పుడు అదే రిపీట్ అవుతుందని ఎద్దేవా చేశారు. ఉద్యమకారులు, బి ఆర్ ఎస్ పార్టీ అంటే ఎండ కూడా బయపడుతుందని, 25 సంవత్సరాలలో మెదక్ లో గులాబీ జెండా ఎగురుతుందని వేరే జెండా ఎగురడం లేదు, మెదక్ జిల్లా గులాబీ అడ్డా, మళ్ళీ బి ఆర్ ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

10 ఏళ్లలో కెసిఆర్ ఏం చేశారని రేవంత్ రెడ్డి అడుగుతున్నారు. కెసిఆర్ తోనే కొత్త జిల్లాలు ఏర్పాటు చేసుకున్నామని, కెసిఆర్ నిర్మించిన కలెక్టర్ ఆఫీస్ కు నామినేషన్ కార్యక్రమంలో రేవంత్ పాల్గొన్నారన్నారు. పేగులు మెడలో రాక్షసులు వేసుకుంటారని సిఎం స్థాయి తగ్గించుకొని మాట్లాడాలి, మెదక్ అభివృద్ధి గురించి మాట్లాడే హక్కు రేవంత్ కు లేదని ఘాటుగా విమర్శించారు. జిల్లాలు ఏర్పాటు చేయడంతో పాటు మెడికల్ కాలేజీలు కెసిఆర్ తెచ్చారు, అందమైన నాలుగు లైన్ రహదార్లు వేశామని చెప్పుకొచ్చారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీ అమలు అని బాండ్ పేపర్ మీద రాశారు, బాండ్ పేపర్ పరువు తీశారు, దేవుళ్ళను రాజకీయాలకు వాడుతున్నారు, రేవంత్ ఎవరి మీద ఓట్లు పెట్టినా జనాలు నమ్మడం లేదని చురకలంటించారు. ఆరు హామీలు అమలు కాలేదు కానీ గొప్పలు చెప్పుకుంటున్నారు. ఈ ముఖ్యమంత్రి కి తన ఎత్తు గురించి ధ్యాస ఉంది గాని రైతుల సమస్య పట్ల ధ్యాసే లేదు అని మండిపడ్డారు. 200 పైగా రైతులు, 30 మంది ఆటో కార్మికులు చనిపోయినా కూడా వారి కుటుంబాలను రేవంత్ పరామర్శించడం లేదని ధ్వజమెత్తారు.

బిజెపి రఘునందన్ మాటలు నమ్మడమంటే నీళ్లు లేని బావిలో దూకడమే నయం, దుబ్బాకల అలాగే మాట్లాడితే అక్కడ ప్రజల బుద్ధి చెప్పారు. బిజెపి ఏ వర్గాలకు మేలు చేయలేదు, బిఆర్ఎస్ ఈ ఎన్నికలలో గెలిస్తే భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలు అమలు చేస్తుందన్నారు. బిఆర్ఎస్ గెలిస్తేనే కాంగ్రెస్ వాళ్ళ మెడలు ఉంచడం సాధ్యమవుతుందని, కాంగ్రెస్ వాళ్లను భూమి మీద దించాలంటే వెంకట్రామ రెడ్డిని గెలిపించాలని కోరారు. బిఆర్ఎస్ కు మంచి అభ్యర్థి దొరికాడు, వెంకటరామిరెడ్డిని మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఒకాయన ఆరో తరగతి, మరొకరు బ్లాక్ మెయిలర్, బి ఆర్ ఎస్ నుండి కలెక్టర్ గా పని చేసిన వ్యక్తి ఉన్నాడు, ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తా అంటున్నాడు, ప్రజలు కార్యకర్తల దగ్గరికి వెళ్లి కాంగ్రెస్, బిజెపి మోసాల గురించి చెప్పాలని' హరీష్ రావు వివరించారు.

# బిజెపికి ఈసి నోటీసు

న్యూఢిల్లీ: ఎన్నికల కోడ్ ను ప్రధాని నరేంద్ర మోడీ తొలిసారి ఉల్లంఘించినందుకు ఎన్నికల సంఘం బిజెపి కి నోటీసు ఇచ్చింది. విచ్చినకర, ద్వేషపూరిత ప్రసంగాన్ని ప్రధాని నరేంద్ర మోడీ రాజస్థాన్ లోని బాన్స్ వాడాలో ఇచ్చారు.దానిపై ప్రతిపక్షాలు ఫిర్యాదు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాయి. దానిపై ప్రతిస్పందించాల్సిందిగా ఎన్నికల సంఘం గురువారం బిజెపిని కోరింది. అదే సమయంలో బిజెపి దాఖలు చేసిన ఫిర్యాదుపై ప్రతిస్పందించాల్సిందిగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీని ఎన్నికల సంఘం కోరింది. బాన్స్వాడాలో ఏప్రిల్ 21న మోడీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) దాఖలు చేసిన ఫిర్యాదుపై ప్రతిస్పందించాలంటూ ఎన్నికల సంఘం బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా కు లేఖ రాసింది. ఇంకా 'ప్రవర్తనా నియమావళి విషయంలో స్టార్ క్యాంపెనైర్లందరూ ఉన్నత ప్రమాణాలను కాపాడాలి' అంటూ కోరింది. ప్రధానికి వ్యతిరేకంగా వచ్చిన ఫిర్యాదును స్వీకరించి ఎన్నికల సంఘం ప్రతిస్పందించడం ఇదే తొలిసారని అధికారులు తెలిపారు. మోడీ తన ప్రసంగంలో "కాంగ్రెస్ అర్బన్ నక్సల్స్ తో చేతులు కలిపిందని, పైగా ఆస్తుల సర్వే, సంపద, మంగళ సూత్రం సహా బంగారంపై కూడా సర్వే చేయిస్తామని, సంపదను ముస్లింలకు పున:పంపిణీ చేస్తామని అంటోంది. ప్రతిపక్షం మహిళల మంగళ సూత్రాన్ని కూడా వదిలిపెట్టేలా లేదు" అన్నారు. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ' దేశ వనరులు మైనారిటీలకు ముందు అందే హక్కు ఉండాలి' అన్నారని కూడా మోడీ తన ప్రసంగంలో గుర్తుచేశారు. మోడీ తన ప్రసంగంలో " మీరు వారిని ఎన్నుకునే విషయం మాట్లాడుతున్నారు. వారేమో తమ మేనిఫెస్టో లో బంగారం తీసేసుకుని, అందరికీ పంచిపెడతాం అన్నారు. ఇదివరలో తమ ప్రభుత్వం ఉన్నప్పుడు వారు దేశ సంపదపై తొలి అధికారం ముస్లింలదే అన్నారు. ఈ సంపదను ప్రోగు చేసి ఎవరికిస్తారు? ఎవరికైతే ఎక్కువ మంది పిల్లలున్నారో వారికి... దేశంలోకి చొరబడిన వారికి. మీ కష్టార్జితం దేశంలోకి చొరబడినవారికి ఇస్తారట... మీకు సమ్మతమేనా..." అంటూ కొనసాగించారు. తమిళనాడులోని కొయంబత్తూర్ లో రాహుల్ గాంధీ, ప్రధాని మోడీ పై చేసిన ఆరోపణలపై కూడా ఎన్నికల సంఘం రాహుల్ గాంధీకి లేఖ రాసింది. తనని రాముడి గుడి ప్రారంభోత్సవానికి పిలువలేదని, కారణం తాను ఎస్సీ కనుక అని అన్న ఖర్గేకు కూడా ఎన్నికల సంఘం ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన నోటీసు పంపింది.

# సందేశ్‌ఖాలీ కేసులో సిబిఐ తొలి ఎఫ్ఐఆర్ నమోదు

పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో భూ కబ్జా, మహిళలపై లైంగిక దాడి ఆరోపణలకు సంబంధించి ఆ ప్రాంతానికి చెందిన ఐదుగురు పలుకుబగల వ్యక్తులపై తొలి కేసును సిబిఐ నమోదు చేసినట్లు గురువారం అధికారులు వెల్లడించారు. భూ వివాదానికి సంబంధించిన ఈ కేసులో బాధితుడి కుటుంబానికి చెందిన మహిళలు ఆ ప్రాంతంలోని పలుకుబడి గల వ్యక్తుల నుంచి లైంగిక దాడిని ఎదుర్కొన్నట్లు అధికారులు తెలిపారు. అయితే ఐదుగురు నిందతులు, బాధితుల పేర్లను సిబిఐ ఇప్పటివరకు వెల్లడించలేదు. సందేశ్‌ఖాలీలో మహిళలపై లైంగిక దాడులు, భూ కబ్జాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై కోర్టు పర్యవేక్షణలో సిబిఐ దర్యాప్తునకు కలకత్తా హైకోర్టు ఏప్రిల్ 10న అదేశించింది. బాధితులకు న్యాయం లభించేదుందకు నిష్పాక్షిక దర్యాప్తు అవసరమని న్యాయస్థానం పేర్కొంది. అటువంటి కేసులపై ఫిర్యాదులు చేసేందుకు ఇమెయిల్ ఐడిని కూడా సిబిఐ తెలియచేయగా పెద్దసంఖ్యలో ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. ఆరోపణలను నిర్ధారించుకోవడానికి సిబిఐ తన బృందాలను



సందేశ్‌ఖాలీకి పంపించింది. ప్రాథమిక ఆధారాలు లభించిన చోట అక్కడికక్కడే కేసులు నమోదు చేయాలని సిబిఐ నిర్ణయించింది. భూ కబ్జా, మహిళలపై లైంగిక దాడి జిరిగినట్లు ప్రాథమిక ఆధారాలు లభించిన చోట తొలి ఎఫ్ఐఆర్‌ని నమోదు చేసిన సిబిఐ దాన్ని కలకత్తా హైకోర్టుకు అందచేసింది.

# కోదాడ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం



పట్టణ శివారులోని శ్రీరంగాపురం వద్ద గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా కోదాడ మండలం చిమిర్యాలకు చెందిన శ్రీకాంత్ (30) గత పది ఏళ్లుగా హైదరాబాదులో కార్ డ్రైవర్‌గా పనిచేస్తూ, జీవనం గడుపుతున్నాడు. అతనికి భార్య నాగమణి ఇద్దరు పిల్లలు లాస్య(4), లావణ్య(2) ఉన్నారు. లాస్యకు విజయవాడ గుణదలలో చెవులు కుట్టించే వేడుకకు హైదరాబాద్ నుండి శ్రీకాంత్ కుటుంబంతో పాటు బంధువులు మాణిక్యమ్మ (48), చంద్రరావు (50), కృష్ణంరాజు (34), స్వర్ణకుమారి (33) పిల్లలు కౌశిక్, కార్తీక్ బయలుదేరారు. మొత్తం పది మంది కారులో విజయవాడకు వెళ్తుతుండగా.. కోదాడ పట్టణ శివారులోని శ్రీరంగాపురం వద్ద ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీకాంత్ అతని కుమార్తె లాస్య,అత్త మామలైన మాణిక్యమ్మ, చంద్రరావు, బామరిది కృష్ణంరాజు, చెల్లెలు స్వర్ణ అక్కడికక్కడే మృతిచెందగా మృతుడు శ్రీకాంత్ భార్య నాగమణి అతని కుమార్తె లావణ్యతో పాటు బంధువుల పిల్లలు తీవ్రంగా గాయపడ్డారు. మృతదేహాను పోలీసులు కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడ్డ క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నారు.

**మిన్నంటిన రోదనలు**

మృతుడు శ్రీకాంత్ స్వగ్రామం చిమిర్యాల గ్రామం నుండి బందువులు పెద్ద ఎత్తున కోదాడ ప్రభుత్వ వైద్య శాలకు చేరుకున్నారు. వేడుక ముచ్చట తీరకముందే తమ వారి బతుకులు గాలిలో కలిసిపోవడంతో బంధువులు రోదిస్తున్న తీరుతో హాస్పిటల్ ప్రాంగణంలో హృదయవిదారక పరిస్థితులు నెలకొన్నాయి. మృతదేహాలను పోస్టుమార్టం తీసుకెళు తున్నప్పుడు ఆటోలో ఉన్న మృతదేహాలను చూసి పలువురు ఉద్వేగానికి లోనయ్యారు.

**గోవిందపురం గ్రామంలో విషాదఛాయలు**

ఖమ్మం జిల్లా బొనకల్ మండలం గోవిందాపురం గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడంతో గ్రామస్తులంతా ఒకసారిగా కన్నీరు మున్నీరయ్యారు. అనాధలైన కార్తీక్, కౌశిక్‌లను చూసి భాగ్వేదానికి గురైయ్యారు. అటు తల్లిదండ్రులు నాయనమ్మ, తాతయ్యలు చనిపోవడంతో ఆ పిల్లలకు దిక్కు ఎవరంటూ గ్రామస్తులు కన్నీరు పెట్టుకున్నారు.

# ఓవైపు అసెంబ్లీ ఎన్నికలు.. మరోవైపు ఎదురుకాల్పులు

ఒడిశాలో భద్రతాదళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురెదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. బౌద్ జిల్లా పర్హెల్ ప్రాంతం లోని రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో గురువారం తెల్లవారు జామున ఈ సంఘటన చోటు చేసుకుందని పోలీస్ ఉన్నతాధికారి సౌమేంద్ర ప్రియదర్శి తెలిపారు. మృతదేహాలను గుర్తించడానికి లొంగిపోయిన మావోయిస్టుల సహకారం తీసుకుంటున్నట్టు చెప్పారు. అయితే ఈ కాల్పుల్లో ఒకరు గాయపడ్డారని, చెప్పారు. కాల్పులు జరిగిన ప్రాంతంలో పేలుడు పదార్థాలు, గ్రెనేడ్ లాంచర్ లభించాయని , వాటిని సీజ్ చేశామన్నారు. ఒడిశాలో లోక్‌సభ ఎన్నికలతోపాటు అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ సంఘటన చోటు చేసుకున్న బౌద్‌లో మే 20న ఎన్నికలు జరగనున్నాయి. గత నాలుగు నెలల్లో



బౌద్ ప్రాంతంలో ఈ తరహా సంఘటనలు 7 చోటు చేసుకున్నాయని సౌమేంద్ర ప్రియదర్శి ఉదహరించారు.

# తెలంగాణలో పిఎం మోడీ పర్యటన.. షెడ్యూల్ ఖరారు

హైదరాబాద్: తెలంగాణ బిజెపి అభ్యర్థుల తరఫున ప్రచారం చేసేందుకు ప్రధాని మోడీ కూడా రంగంలోకి దిగబోతున్నారు. ఈమేరకు షెడ్యూల్ ఖరారైంది. ఏప్రిల్ 30వ తేదీ, మే 3, 4 తేదీల్లో ప్రధాని మోడీ తెలంగాణలో పర్యటించి, లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. ఈనెల 30 జహీరాబాద్‌లో బహిరంగ సభలో ప్రసంగిస్తారు. తర్వాత శేరిలింగంపల్లిలో ఐటి కంపెనీ ఉద్యోగులతో ప్రధాని సమావేశ మవుతారు. తర్వాత మే 3వ తేదీన వరంగల్‌లో నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని పాల్గొంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. అదే రోజు భువనగిరి, నల్లగొండ పార్లమెంటు స్థానాలను కలుపుతూ మరో సభ నిర్వహిస్తారని పేర్కొన్నారు. మే 4వ తేదీన మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నారాయణపేట, చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని వికారాబాద్‌లో మోదీ ప్రచార సభలు నిర్వహిస్తారని వివరించారు. తెలంగాణలో ఈసారి మెజారిటీ స్థానాలపై కమలం పార్టీ కన్నేసింది. పది స్థానాలు టార్గెట్‌గా పెట్టుకుంది. ఈ క్రమంలోనే ఇప్పటికే నామినేషన్ కార్యక్రమాల్లో కేంద్ర మంత్రులు పాల్గొంటున్నారు. నామినేషన్లు ముగియగానే ప్రధాని మోడీతో పాటు కేంద్ర మంత్రులు, జాతీయ నాయకులు ప్రచారం చేయనున్నారు. రోడ్‌షోలు, సభలు నిర్వహించనున్నారు.

# ఐపిఎల్ స్ట్రీమింగ్ కేసు.. నటి తమన్నాకు సమన్లు

న్యూఢిల్లీ: ప్రముఖ నటి తమన్నాకు మహారాష్ట్ర సైబర్ పోలీస్ విభాగం సమన్లు జారీ చేసింది. ఐపీఎల్ 2023 మ్యాచ్‌లను అక్రమంగా "ఫెయిర్ ప్లే" యాప్‌లో ప్రదర్శించిన కేసులోఆమెను ప్రశ్నించేందుకు ఈ నోటీసులిచ్చింది. ఈ నెల 29న సైబర్ విభాగం ఎదుట విచారణకు హాజరు కావాలని సూచించింది. నిబంధనలకు వ్యతిరేకంగా ఐపీఎల్ మ్యాచ్‌లను ఈ యాప్‌లో ప్రసారం చేయడంతో 'వయాకామ్' మీడియాకు రూ. కోట్ల మేర నష్టం జరిగిందని సైబర్ విభాగం వెల్లడించింది. ఇదే కేసులో ఇటీవల మరో నటుడు సంజయ్ దత్‌కు కూడా సమన్లు జారీ అయ్యాయి. ఏప్రిల్ 23నే విచారణకు రావాలని ఆదేశించగా, ఆయన గైర్హాజరయ్యారు. ఆ సమయంలో తాను దేశంలో లేనని, వాంగ్మూలం ఇచ్చేందుకు మరో తేదీ కేటాయించాలని కోరారు. ఈ ఫెయిర్‌ప్లే యాప్ అనేది మహదేవ్ ఆన్‌లైన్ గేమింగ్ అండ్ బెట్టింగ్ అప్లికేషన్‌కు అనుబంధ సంస్థ. ఇందులో ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రసారం చేసేందుకు ఎలాంటి అధికారిక బ్రాడ్ కాస్టింగ్ హక్కులు లేవు. అయినప్పటికీ గత ఏడాది నిబంధనలకు విరుద్ధంగా కొన్ని మ్యాచ్‌లను ఈ యాప్‌లో ప్రసారం చేశారు. వాటిని చూడాలంటూ పలువురు బాలీవుడ్ నటులు, గాయకులు ప్రచారం చేశారు. ఫలితంగా వయాకామ్‌కు రూ. కోట్లల్లో



నష్టం రావడంతో ఆ సంస్థ పోలీస్‌లను ఆశ్రయించింది.న ఈ కేసులో గతంలో బాలీవుడ్ గాయకుడు బాద్‌షా , నటి జాక్వెలిన్ ఫెర్నాండెస్ , సంజయ్ దత్ మేనేజర్లను సైబర్ విభాగం ప్రశ్నించింది.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com